

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

# కరీంనగర్

పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

గురువారం 19 ఫిబ్రవరి 2026 | 15 పేజీలు


# అక్రమ నిర్మాణాలకు అడ్డేది..?

## - అధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్న అక్రమ నిర్మాణాలు..




**సూర్య, మెట్‌పల్లి:-**

అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నా మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోంది. మెట్‌పల్లి మున్సిపల్ లో అడ్డగోలుగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతుండగా అధికారులకు మాత్రం కాసుల వర్షం కురిపిస్తున్నది. అధికారులను మామూళ్లతో మచ్చిక చేసుకుంటున్న అక్రమార్కులు పట్టణంలో అనుమతులు లేకుండా అడ్డగోలుగా నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో కొంతమంది సెట్ బ్యాక్ లేకుండా, పాత భవనంపై కొత్తగా భవనాలు నిర్మిస్తుండగా మరి కొంతమంది రోడ్లను నాళాలను సైతం ఆక్రమిస్తూ నిర్మాణాలు చేపడుతున్నారు. స్థానికులు ఫిర్యాదు చేసినా నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతూ అక్రమార్కుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పట్టణంలో ఆక్రమణలు అక్రమ నిర్మాణాలతో విస్తరిస్తుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2లో



### అత్తింటి వేధింపులు భరించలేక

# ఆత్మహత్య...

## - ప్రేమించి పెళ్లి చేసుకుని కట్నం కోసం వేధింపులు

## - ఆసుపత్రిలోనూ తప్పని వేధింపులు...

**సూర్య, కరీంనగర్ ప్రతినిధి**

అత్తింటి ఆరళ్లు తట్టుకోలేక వివాహిత ఆత్మ హత్య చేసుకుంది. ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త, అత్తామామలు కట్నం కోసం చిత్రహింస లకు గురి చేసి చివరకు ఆమె బలవన్మరణం చేసుకునే పరి స్థితి తీసుకొచ్చారు. అనారోగ్యం పాలైన భర్తను ఆసుపత్రికి తీసు కొచ్చి చికిత్స అంది స్తున్నప్పుడు కూడా ఆమెను సూటిపోటి మాటలతో వేధిం పులకు గురి చేశారు. పెళ్లయిన నెల రోజుల నుండే తనను చిత్ర హింసలకు గురిచేస్తుం డడం, భర్తతో పాటు మెట్టిని ంటికి చెందిన వారు బాధలకు గురి చేస్తుండడం తట్టుకోలేకపోయిన ఆమె ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. కరీంనగర్ రూర ల్ సీఐ ఏ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకా రం... మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం గొల్ల పల్లికి చెందిన మమత (29)ని ఆమె బంధువైన తాండూరు మండలం చంద్రపల్లికి చెందిన కంబాల నరేష్ దాదాపు 14 నెలల క్రితం ప్రేమించి పెళ్లి (మిగతా 2లో)





## అనుమతులు లేకుండా నీడనిచ్చే చెట్ల నరికివేత...

- బస్టాండ్ ఆవరణలో ఉన్న చెట్లకు రక్షణ ఏది??
- అభివృద్ధి పేరుతో చెట్లను నరకవద్దు...

**సూర్య, ముస్తాబాద్** (వివరాలు లోపలి పేజీల్లో)

## కరీంనగర్ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయం..!

- 66వ డివిజన్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మేయర్ కోలగని శ్రీనివాస్

**సూర్య, కరీంనగర్** (వివరాలు లోపలి పేజీల్లో)

## ఈ భవనంను.... ఉపయోగించరా...!?

- వృధాగా మారిన బాలసదనం భవనం

**సూర్య, హుజురాబాద్** (వివరాలు లోపలి పేజీల్లో)

### ఇందిరమ్మ ఇండ్లను గృహప్రవేశాలకు

# రెడీ చేయండి..



- మార్చి 31 వరకు నిర్మాణ పనులన్నీ పూర్తి చేయండి..
- ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించండి..
- కరీంనగర్ జిల్లాలో వేగంగా ఇండ్ల నిర్మాణం..
- రాష్ట్ర గృహనిర్మాణ శాఖ కార్యదర్శి, హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి గౌతమ్..
- జిల్లా కలెక్టర్‌తో కలిసి ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన
- ఇండ్ల ప్రోగ్రెస్‌పై జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి కితాబు

8లో

### వరికి మొగిపురుగు

# రైతన్నకు దిగులు..!

## - రసాయన మందులతో పెరుగుతున్న ఖర్చు

## - ఆందోళనలో అన్నదాతలు

**సూర్య, గంభీరావుపేట** 2లో





# అక్రమ నిర్మాణాలకు అడ్డేది..?

సూర్య, మెట్‌పల్లి:-

- అధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్న అక్రమ నిర్మాణాలు..

ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల పై ప్రజల ఫిర్యాదులు అధికారులకు ఆదాయ మార్గాలుగా మారుతున్నాయి. ఫిర్యాదు అందగానే హడావిడి చేసే అధికారులు ఆపై చర్యలకు మీనమేషాలు లెక్కపెట్టడం ఆరోపణలకు చేకూరుస్తున్నాయి. అక్రమ నిర్మాణాలను అధికారులు సందర్శించిన అది అక్రమ నిర్మాణం అని తెలిసి ఆపాలంటూ మౌఖిక ఆదేశాలు జారీచేసిన అక్రమార్కులు పనిని మాత్రం ఆపకపోవడంతో అధికారుల తీరుపై స్థానికంగా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అయితే అక్రమ నిర్మాణం పేరిట హడావిడి చేయడం పనులు ఆపడంతో అధికారులకు డిమాండ్ పెరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అక్రమ నిర్మాణాల పై అధికారులు కాగితాల పై ఖాకీ లెక్కలు చెబుతూ అక్రమార్కులను బెదిరింపులకు గురిచేసి తమ టార్గెట్ రీచ్ కాగానే అక్కడి నుంచి జారుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

- ఈ అక్రమాల సంగతేంటి..?

పట్టణంలోని 12వ వార్డు లో కీర్తి ఫంక్షన్ హాల్ వెనుక ఓ కమర్షియల్ భవనం నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ లేకుండా ఉండడమే కాకుండా రోడ్డును ఆక్రమించి గోడ నిర్మాణం చేపట్టారు. అయినపట్టికీ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు.పట్టణంలోని 7వ వార్డు బాసర సరస్వతి స్కూల్ లు వెళ్ళే దారిలో పర్మిషన్ లేకుండా పాత భవనంపై మరో ఫ్లోర్ లు నిర్మాణం చేస్తున్నారు. వెల్లుల్ల రోడ్ లో హెచ్పీ గ్యాస్ ఆఫీస్ సందులో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టారు ఈ నిర్మాణం పై పలుమార్లు పిర్యాదులు కూడా అందినట్లు సమాచారం..11వ వార్డు సంఘం హాస్పిటల్ వెనుక ఓ వ్యక్తి పాత భవనం పై అనుమతి లేకుండా మరో నిర్మాణం చేపట్టాడు. తొమ్మిదవ వార్డు హనుమాన్ దేవాలయం ఎదురు వీధిలో పాత భవనంపై మరో ఫ్లోర్ నిర్మాణం చేపట్టగా ఆ భవనానికి పర్మిషన్ ఇవ్వకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు కొత్త నిర్మాణం కింద పర్మిషన్ ఇచ్చినట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. ఎనిమిదవ వార్డు వెల్లుల్ల రోడ్ కాలువ ప్రక్కన ఓ వ్యక్తి రోడ్డును ఆక్రమించి ఓ అపార్ట్మెంట్ నిర్మాణం చేపట్టాడు. ఈ నిర్మాణానికి అధికారులు పర్మిషన్ ఇచ్చినట్లు



సమాచారం.

- ఈ నిర్మాణాలను ఆపేది ఎవరు..?

అక్రమ నిర్మాణాలు అనుమతులు లేకుండా వెలుస్తున్న బంగ్లాలు ఆగేది ఎలా అనే సందేహం సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాల పై అధికారులకు ఫిర్యాదు చేసినా మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు ఆపేది ఎవరు అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అయితే మున్సిపల్ కు ప్రత్యేక అధికారిగా జిల్లా అడిషనల్ కలెక్టర్ ఉన్నప్పటికీ ఆక్రమణలు అక్రమ నిర్మాణాలు ఆగకపోవడం పట్టణ వాసులను ఆందోళన కలిగిస్తుంది. ఇప్పటికైనా జిల్లా అడిషనల్ కలెక్టర్ స్పందించి మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్న ఆక్రమణలు,అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకొని మున్సిపల్ ఆదాయాన్ని పెంచాలని కోరుతున్నారు.



## మహిళ ఆత్మహత్య

సూర్య, వేములవాడ:

వేములవాడ పట్టణానికి చెందిన వెంగళ దివ్య అలియాస్ రోహిణి (32) అను మహిళ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దివ్య గత కొద్ది రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతోంది. గురువార ఉదయం 6 గంటలకు తమ ఇంటిలో ఉరివేసుకొన్నట్లు తల్లి బొంగు రాజా తెలిపింది. పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వేములవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలికి పది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పర్సు పోయినది

ఆచూకీ తెలిస్తే సమాచారం అందించండి. తగిన పారితోషకం ఇవ్వబడును. మల్యాల మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన కోకిల లక్ష్మీ భర్త సర్వయ్యకు సంబంధించిన పర్సు సారంగాపూర్ మండలం పెంబట్ల బస్టాండులో దుబ్బ రాజన్న జాతరలో మంగళవారం రోజు పోయినది.. ఈ పర్సులో లేబర్ కార్డు గుర్తింపు పాన్ కార్డు రేషన్ కార్డు బీడీ పిఎఫ్ కార్డులతో పాటు 4000 రూపాయలు పర్సులో ఉన్నవి. ఈ పర్సు ఎవరికైనా దొరికితే ఈ క్రింది నెంబర్కు **99494 84218** సమాచారం అందించండి. పర్సును దొరికిన వారు సమాచారం అందిస్తే వారికి తగిన పారితోషకం ఇవ్వబడును..

## గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిం దిగా పాఠకులకు సూచించడ మైనది. ప్రకటన దారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైము లతో సూర్య దినపత్రికకు ఏ విధమయిన సంబంధం లేదు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## ఈవీఎం గోదాశీ ను తనిఖీ చేసిన కలెక్టర్ పమేలా సత్పతి

సూర్య, కరీంనగర్ ప్రతినిధి



జిల్లా కేంద్రశీ కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాశీను బుధవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోదాంను తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎం ల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకు న్నారు. అనంతరం గోదాశీ వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీసీ ఫుటేజ్ ల గదుల పనితీరు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మడుపు మోహన్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, బిజెపి పార్టీ ప్రతినిధి నాంపల్లి శ్రీనివాస్, టిడిపి పార్టీ ప్రతినిధి ఎర్రవెల్లి రవీందర్ సిపిఎం పార్టీ ప్రతినిధి డి.నరేష్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# అత్తింటి వేధింపులు భరించలేక ఆత్మహత్య...

*(మొదటి పేజీ తరువాయి)*

చేసుకున్నాడు. గోదావరిఖనిలోని అడ్డగుంటపల్లిలో కొంతకాలం నివాసం ఉంటూ సింగరేణి వన్ ఇంక్లైన్ బావిలో ఉద్యోగం చేసేవాడు. ఇటీవలే వీరు గోదావరి ఖనిలోని గంగానగర్ అద్దె ఇంటిలోకి మారారు. అయితే ప్రేమించి పెళ్లి చేసుకున్న నెలరోజులకు మమత భర్త నరేష్, అత్త చిన్నక్క, మామ భూమయ్య, ఆడపడుచు లింగంపల్లి కవితలు కట్నం కోసం వేదింపలకు గురి చేసేవారు. తనను శారీరకంగా, మానసికంగా వేదింపులకు గురి చేస్తున్నారని మమత ఫోన్ చేసి తెలపడంతో రెండు నెలల క్రితం మమత సోదరుడు మహేష్ ద్వారా రూ. లక్ష నగదు ఇచ్చి పంపించారు. ఆ తరువాత కూడా మమతను వేదింపులకు గురి చేస్తున్నా రని చెప్పుకుని రోధించేది. ఈ నెల 16న మమత తన సోదరుడు మహేష్ కు ఫోన్ చేసి తనను అత్తింటి వారు చిత్ర హింసలకు గురి చేస్తున్నారని, చంపేసే ప్రమాదం ఉందని చెప్పడంతో తాను దూరంగా ఉన్నానని మరునాడు ఉదయం వస్తానని వివరించాడు. దీంతో తన చిన్నాన్న కొడుకు అయిన లింగంపల్లి శంకర్ కు కాల్ చేసి చెప్పగా ఆటోలో వెళ్లి మంచిర్యాల సమీపం లోని నస్పూర్ కాలనీకి తీసుకెళ్లాడు. మరునాటి ఉదయం గోదావరిఖని లోని గంగానగర్ ఇంటి యజమాని ఫోన్ చేసి నరేష్ మెట్ల వద్ద పడి ఉన్నాడని మమతకు ఫోన్ చేసి చెప్పడంతో వెంటనే వెళ్లిన మమత అత్తింటి వారికి భర్త నరేష్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తీసుకెళ్లాలని చెప్పగా కరీంనగర్ లోని మెడికోవర్ ఆసుపత్రికి తీసుకెళ్లిన మమత చికిత్స చేయిస్తోంది. మంగళవారం మెడికోవర్ ఆసుపత్రికి మమత సోదరుడు మహేష్ కూడా చేరుకోగా అక్కడే ఉన్న మమత అత్తింటి వారు ఆమెను మానసికంగా వేదింపులకు గురి చేశారు. నీ కారణంగానే తమ కొడుకు పరిస్థితి ఇలా తయారైం



దంటూ సూటి పోటీ మాటలు అనడంతో తట్టుకోలేక పోయిన మమత వాష్ రూంకని చెప్పి వెళ్లింది. ఆ తరువాత మహేష్ మమతకు ఎన్ని సార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో ఆందోళన చెందాడు. మధ్యా హ్నం 3.35 గంటల సమయంలో మమత సోదరుడు మహేష్ కు కాల్ చేసి అత్తింటి వారి వేదింపులు తట్టుకోలేకపోతున్నానని, తాను చనిపోతున్నానని చెప్పుడగానే ఆమె అరుపులు వినిపించాయి. వెంటనే మహేష్ డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వగా పోలీసులు మమత లొకేషన్ ట్రేస్ చేశారు. ఆమె తీగలగుట్టపల్లిలోని హనుమాన్ నగర్ రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్నట్లుగా గుర్తించారు. పోలీసులతో పాటు మహేష్ కూడా ఘటనా స్థలానికి చేరుకోగా మమత పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుని చనిపోయింది. మృతదేహాన్ని కరీంనగర్ సివిల్ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఘటనా స్థలాన్ని ప్రొబేషనరీ ఐపీఎస్ ఆఫీసర్ సోహం సునీల్, కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ లు పరిశీలించారు. మమత తండ్రి లింగంపల్లి పోషం ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త నరేష్ తో పాటు అత్తింటి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేశామని సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.

# వరికి మొగిపురుగు రైతన్నకు దిగులు..!

సూర్య, గంభీరావుపేట

యాసంగి సాగులో వరిలో మొగి పురుగు ఉధృతి పెరగడంతో రైతన్న దిగులు చెందుతున్నాడు. గంభీరావుపేట మండలంలో వరికి మొగిపురుగు రావడంతో రైతుకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. గంభీరావుపేట, నర్మాల పొన్నాలపల్లె తో పాటు పలు గ్రామాలలో కాండం తొలిచేపురుగు, ఆకు ముడత తెగుళ్లు సోకుతున్నాయని రైతులు వాపోతున్నారు. వరి నాట్లు వేసి దాదాపు 2నెలలు కావస్తున్న ఇప్పటికే రెండుసార్లు రసాయన మందులు చల్లామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గంభీరావుపేట మండలంలో 19 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. అక్కడక్కడ గ్రామాల్లో అగ్గి తెగుళ్ళు సోకుతున్నాయని రైతులు చెబుతున్నారు.

- వరిలో మొగిపురుగుకు కారణాలు.

ఆలస్యంగా లేదా ముదిరిన నాట్లు వేయడం,



సాధారణంగా రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదు కావడం, సూర్య రశ్మి రోజుకు 7 గంటల కంటే తక్కువగా ఉండడం, కాండం బలహీనం కావడం లాంటి కారణాలతో మొగిపురుగు తొందరగా వ్యాప్తి చెందుతుంది.

- యాజమాన్య పద్ధతులు

అధిక యూరియా వాడకాన్ని తగ్గించాలి. పొలంలో నీటిని ఆరబెడుతూ తడి,పొడి పద్ధతిని రైతులు పాటించాలి. ముదిరిన నారువేయడం నివారించాలి..

### అదనంగా పెట్టుబడి అవుతోంది



నేను నాలుగు ఎకరాల్లో వరి సాగు చేసిన, 15రోజులకే మొగి పురుగు సోకింది.వ్యవసాయ అధికారుల సూచనతో కార్బోఫ్యూరాన్ గుళికలు చల్లిన అయినా తగ్గడం లేదు. ఈ తెగుళ్లతో పెట్టుబడి ఎక్కువ అవుతుంది. తెగుళ్లతో పంట దిగుబడి తగ్గి నష్టాలే మిగులుతున్నాయి. గతేడాది అధిక వర్షాలతో పంట పెట్టుబడి కూడా మిగలలేదు.

- పర్శరాములు యాదవ్,రైతు, గంభీరావుపేట

### పిలక దశలోనే నివారణ చర్యలు చేపట్టాలి.



ప్రస్తుతం చాలాచోట్ల వరి పొలాలు పిలక దశలో ఉన్నాయి. ఈ సమయంలో మొగి పురుగు ఉధృతిని నివారించేందుకు ప్రతి ఎకరాకూ 3 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలి. అందులో వారానికి బుట్టకు 25-30 పురుగులు పడినప్పుడు తప్పని సరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఈ దశలో ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కిలోలు లేదంటే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8 కిలోలు, లేదంటే క్లోరాన్ట్రానిలిప్రోల్ 4జీ గుళికలు 4 కిలోలు 20 నుంచి 25 కిలోల ఇసుకలో కలిపి బురద పదనులో వేసుకోవాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే, కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50%, ఎకరాకు 400 గ్రాలేదా క్లోరంట్రో నిలిప్రోల్ 0.6ఎత్రీ లీటర్ నీటికి లేదా 60 ఎత్రీ ఎకరానికి పిచికారి చేయాలి.

- సలావుద్దీన్, మండల వ్యవసాయ అధికారి, గంభీరావుపేట

## అనుమతులు లేకుండా నీడనిచ్చే చెట్లు నరికివేత

**- బస్టాండ్ ఆవరణలో ఉన్న చెట్లకు రక్షణ ఏది?? - చెట్లను రక్షించాలంటూ ఉన్న పర్యావరణ ప్రేమికులు**

**- అభివృద్ధి పేరుతో చెట్లను నరకవద్దు - చెట్లను పెంచి కాలుష్యాన్ని నివారించాలంటూన స్థానికులు**

**సూర్య, ముస్తాబాద్**

నీడనిచ్చే పచ్చని చెట్ల నరికివేత పర్యావరణానికి తీవ్ర హాని కల్గుతుంది.చెట్లు నరికివేయడం వలన వేసవిలో నీడనిచ్చే బాటసారులకు ఇబ్బందులను కలుగజేస్తూ,భూగర్భ జలాల తగ్గుదలకు కారణ మవుతోంది.అభివృద్ధి,నిర్మాణాలు,వాస్తు ఇతర కారణాలతో ఏళ్ల నాటి చెట్లను అడ్డగోలుగా నరుకుతున్నారు.నిబంధనలకు విరుద్ధంగా నరికితే చట్టరిత్యా నేరం మరియు జరిమానాలు విధించబ డతాయి.నీడనిచ్చే చెట్లను నరికివేయడం పర్యా వరణానికి మరియు సమాజానికి తీవ్రమైన నష్టం కలిగిస్తుంది.ముస్తాబాద్ మండలం లో అభివృద్ధి పనుల పేరుతో చెట్ల అడుగా ఉన్నాయి అని వాటిని నరుకుతున్నారు.దీని వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది.తెలంగాణ ప్రభుత్వ వాల్టా చట్టం 2005 ప్రకారం,ఎవరైనా పౌరులు లేదా సంస్థలు తమ స్థలములలో ఉన్న చెట్లను ఇష్టారాజ్యంగా నరికివేయడం లేదా స్థల మార్పిడి చేయడం కుదరదు.ఇందుకోసం సంబందించిన అధికారి నుంచి అనుమతి పొందాలి.అనంతరమే చెట్లను నరికే అవకాశం ఉంటుంది.అయితే



కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా చెట్ల ను నరికివేస్తున్నట్లను నరికివేస్తున్నారు.ఇది ముమ్మాటికీ చట్టరిత్యా నేరం.ఈ విషయాన్ని ప్రతీ ఒక్కరూ గమనించి చెట్లను నరికే ముందుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోని కొట్టివేయా లని గ్రామస్థులు కోరుతున్నారు.

**- ఏండ్ల నాటినుండి పెంచిన భారీ వృక్షాలను నరికివేయదు**

**- ఆటో యూనియన్ ప్రెసిడెంట్ చిర్రం తిరుపతి**



మండల కేంద్రానికి అతి సమీప గ్రామం తెర్లుమద్ది లో బస్టాండ్ ముందరలో ఉన్నా నీడనిచ్చే భారీ వృక్షాలను నరికి వేయ వద్దు.భారీ వృక్షాన్ని నరికి వేయడం జరుగుతోందని ఆటో యూనియన్ ప్రెసిడెంట్ చిర్రం తిరుపతి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణ ప్రాంగణ సమీపంలో ఉన్న ఈ వృక్షాలు బస్సు,ఆటో కోసం ఎదురుచూసే సమయంలో నీడని ఇచ్చేదని,ఇప్పుడు ఈ చెట్టు నరికి వేయడంపై ప్రయాణికులు నీడ కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బస్టాండ్ ముం దర ఉన్న భారీ వృక్షాలకు అటవీ,రెవెన్యూ శాఖ లు ఎటువంటి అనుమతులు లేకుండా తొలగింపు చేస్తున్నారాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చెట్లు పెంచి కాలుష్యాన్ని నివారించాలని అధికారులు ఒకవైపు చెపుతుంటే ఎంతో పెద్ద వృక్షాలను నీడని ఫలాన్ని అందిస్తున్న సమయంలో ఇలాగే వారి అవసరాలకు ఇష్టానుసారంగా నరికివేసి మొక్కలను నాశనం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికుల కోరుతు న్నారు.ఈ విషయంపై ఎంపిడిఓని సూర్య రిపోర్ట్ ప్రస్తావించగా చెట్లు నరికేందుకు ఎటువంటి అనుమతులు తాము ఇవ్వలేదని చెప్పడం విశేషం.

## బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలోనే వేములవాడ అభివృద్ధి

**- ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అభివృద్ధిపై వాస్తవాలు వెల్లడించాలి**

**- వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి చెలిమెడ లక్ష్మీనరసింహారావు**

**సూర్య, వేములవాడ**

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీని వాస్ తీరుపై బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఎండగట్టారు. ప్రతిసారి పెండింగ్‌లో ఉన్న పనులను గాడిలో పెడుతున్నా మని చెబుతున్నారే తప్ప, గత రెండున్నర ఏళ్లుగా మీరు కొత్తగా సాధించిన అభివృద్ధి ఏంటో ప్రజ లకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.రాజన్న దేవాలయ అభివృద్ధి కోసం రూ.150 కోట్లు వెచ్చించామని చెబుతున్న



మాటల్లో వాస్తవమెంత అని చల్మెడ ప్రశ్నించారు. ఇప్పటి వరకు ఎంత నిధులు ఖర్చు చేశారో భక్తులకు వివరించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాం లోనే వేములవాడ రూపురేఖలు మారాయని గుర్తు చేస్తూ, గుడి చెరువులో 35 ఎకరాల భూమి సేకరణ, 100 పడకల ఆసుపత్రి నిర్మాణం, గుడి చెరువు కట్ట సుందరీకరణ వంటి పనులన్నీ తమ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని స్పష్టం చేశారు. మిడ్ మానేరు నుండి గుడి చెరువులోకి కొత్త పైపులైన్ వేసి నీటి సమస్యను తీర్చిన ఘనత కూడా బిఆర్ఎస్ దేనని ఆయన గుర్తు చేశారు.రాజకీయ అంశాల ప్రస్తావిస్తూ, సొంత పార్టీలో గెలిచిన వారికి కాకుండా బిఆర్ఎస్ నుండి వెళ్లిన వారికి వైస్ ఛైర్మన్ పదవి ఎందుకు కట్టబెట్టారో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులకు అభినందనలు తెలుపుతూనే, తమపై అనవసర విమర్శలు చేయడం మానుకుని నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యేకు చల్మెడ హితవు పలికారు.

## ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**- సెస్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వార్షికోత్సవంలో ప్రిన్సిపాల్ వనజా కుమారి పిలుపు**

**- ఘనంగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడుకోలు**

**సూర్య రాజన్న సిరిసిల్ల**

ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహిం చాలని సిరిసిల్ల పట్టణంలోని స్థానిక సెస్ ప్రభు త్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వనజ కుమా రి విద్యార్థులకు పిలుపునిచ్చారు.బుధవారం జూని యర్ కళాశాలలో వార్షికోత్సవంతో పాటు ద్వితీ య సంవత్సరం విద్యార్థినుల వీడ్కోలు సమావే శం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.ఈ వేడుకలకు కళాశాల ప్రిన్సి పాల్ జి.వనజా కుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యా ర్థినులు చదువును భారంలా భావించకుండా, ఇష్టంతో చదవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్క రూ ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని,





దాని సాధన కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు.గత విద్యా సంవత్సరం ఫలితాల్లో కళాశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి ర్యాంకులతో కళాశాల కీర్తిని చాటారని గుర్తు చేస్తూ, అదే స్ఫూర్తితో ప్రస్తుత విద్యార్థినులు కూడా రాబోయే పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అనంతరం, వార్షికోత్సవం సంద ర్భంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థినులకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సంద ర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మురళీ, సీతారాము,కె. సునీత, ఆఫ్రోజ్ సుల్తానా, శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, నవీన్ రెడ్డి, జబీఉల్లా, ఎం. సునీత, గంగరాజు, షాహిదా, ఆఫీస్ సిబ్బంది, విద్యార్థి నులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు హాల్ టికెట్స్ ఇవ్వని కళాశాలపై చర్యలు తీసుకోవాలి...

**- జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్**

**సూర్య సిరిసిల్ల టౌన్**



భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రోజున జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధి కారికి హాల్ టికెట్స్ ఇవ్వ ని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యం లో కొన్ని ప్రైవేటు కళాశాలలు ఫీజు కట్టకుంటే హాల్ టికెట్స్ ఇవ్వమని విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అట్టి కళాశాలలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.విద్యార్థులకు హాల్ టికెట్ ఇచ్చేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రా లలో విద్యార్థులకు సరియైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జాలపల్లి మనోజ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు కడారి శివ,నాయకులు రవితేజ పాల్గొన్నారు.

## గర్జనపల్లి గ్రామంలో ఉచిత కంటి పరీక్షలు...

**సూర్య వీర్నపల్లి**



వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామం లో సర్పంచ్ రాకేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సిబ్బంది గ్రామపంచాయతీ వద్ద ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు.గ్రామ ప్రజలే కాకుండా పరిసర ప్రాంత గ్రామ ప్రజ లు ఈ అవకాశాన్ని వినియోగించుకు న్నారు. ఆపరేషన్ అవసరమైన వారికి రేపు వారి సిబ్బంది. గర్జనపల్లి వాహ నాన్ని పంపించి వారిని తీసుకొని వెళ్లి ఆపరేషన్ చేపించుకొని తిరిగి ఇంటి వద్ద విడిచిపెట్టనున్నారు సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్స్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కోదురుపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ రజిత

**సూర్య బోయినపల్లి**





మండలంలోని కోదురు పాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్ ఓ డాక్టర్ రజిత. తనిఖీలలో వ్యాధి నిరోధక టీకాల నిలువలను పరిశీలించి, రిఫ్రిజిరేటర్ శీతలీకరణ 02 నుండి 08 వరకు నిర్వహించాలని సూచిస్తూ, రికార్డులను పరిశీలించి, వ్యాధి నిరోధక టీకాలు 0-5 సంవత్సరాలు లోపు పిల్లలకు సకాలంలో వెయ్యాలని, కేంద్ర ఆరోగ్య పథకాల నిర్దేశించిన లక్ష్యా లు సాధించాలని సూచించారు. డాక్టర్ ప్రియాంక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## యూరియా ఆన్ లైన్ బుకింగ్ తో కాకుండా నేరుగా అందించాలి

**- గంభీరావుపేట గ్రోమోర్ ఎరువుల కేంద్రం ఎదుట రైతుల నిరసన**

**సూర్య గంభీరావుపేట**




గతంలో మాదిరిగా పంటలకు ఎరువుల దుకాణంలో నేరుగా యూరియా బస్తా లు అందించాలంటూ బుధవారం గంభీ రావుపేట మన గ్రోమోర్ దుకాణం వద్ద రైతులు నిరసన తెలిపారు. నేరుగా దుకాణం వద్దకు సమయం వున్నప్పుడు వచ్చి ఆటోలో యూరియా తీసుక పోయే పరిస్థితులు ఎటు పోయాయాని అన్నదాతలు తీవ్ర ఆవేదన చెందా రు. ఇచ్చే ఒకటి, రెండు బస్తాల కొరకు స్మార్ట్ ఫోన్ పట్టుకుని ఓటీపీ వచ్చి నాక మండలంలో స్టాక్ వున్నా దుకాణంను ఎంచుకుని రెండు బస్తాలు బుక్ చేయాల్సిన కష్టాలను రైతులకు దూరం చేయాలన్నారు. బుక్ చేసు కున్న ID నెంబర్ ఆధారంంగా దుకాణమ్‌కు పొతే అక్కడ సర్వర్ సమ స్యలు, ఆన్లైన్ రాకపోతే పొద్దాంతా అక్కడే ఉండాల్సిన రోజులు వచ్చాయాని రైతులు మోరపెట్టుకున్నారు. ప్రకృతిని నమ్ముకుని ఆరుగాలం కష్టం చేస్తు న్న అన్నదాతలకు ఆన్లైన్ కాకుండా నేరుగా యూరియా ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# మహిళా సంఘ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

## - మహిళలను కోటీశ్వరులను చేయడం తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం
## - జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



**సూర్య, రాయికల్**

మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ వారిని కోటీశ్వరులుగా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ మండల తాట్లవాయి,ధావన్ పల్లి గ్రామంలో 10 లక్షల చొప్పున నిధులతో నిర్మించనున్న మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ శంకుస్థాపనలు చేశారు. జువ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి మహిళలు తిలకం పెట్టి,బతుకమ్మ ఆడుతూ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాదీ మొదటి నుండి కాంగ్రెస్ కుటుంబం అని, గత ప్రభుత్వంలో చేసిన పనులకు సైతం మాజీ సర్పంచులకు బకాయిలు ఇప్పించడం జరిగిందన్నారు.గత ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ,నూతన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు రేవంత్ రెడ్డి సర్కార్ అమలు చేస్తుందని, మహిళలు ఆత్మ గౌరవంగా ఉండాలని మహిళా సంఘాల భవనాలకు ప్రభుత్వం ప్రాధాన్యం కల్పించిందన్నారు.నిరుపేదలకు సొంతింటి కల సాకారం కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేయడం జరిగిందని,అందరికీ ఉచిత వ్యవసాయ కరెంట్ అందిస్తున్న కాంగ్రెస్ నేడు 200 యూనిట్ల ఉచిత కరెంట్ ఇండ్లకు అందిస్తుందని, గ్రామాల్లో పంటల సాగు పెరిగిందని,ప్రభుత్వమే అన్ని చేయలేదని,శివారు గ్రామాల రైతులు సైతం కాలువలో పోదలను,పూడికను తొలగించుకోవాలని, అప్పుడు చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందుతుందన్నారు రైతులకు అండగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉందని సన్న వడ్లకి బోనస్ విడుదల చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు మాలోత్ ప్రసాద్,ఆకుల మల్లేశం, ఉప సర్పంచ్‌లు బణావత్ రవి, మారుపక నారాయణ, తహసీల్దార్ నాగార్జున, ఎంపీవో సుష్మా, మాజీ జడ్పీటీసీ అశ్విని, మాజీ ఎంపీపీ లావుడ్యా సంధ్యారాణి సురేందర్ నాయక్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ రావు, నాయకులు కోల శ్రీనివాస్, మాజీ పాక్స్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి,రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవి,వైస్ చైర్మన్ సౌజన్య శ్రీదర్ రెడ్డి,ఏ ఈ ప్రసాద్,మాజీ ప్రజా ప్రతినిధులు సాగరిక శ్రీనివాస్,రాజు,రవి,శ్రీనివాస్,రాజీ రెడ్డి, ముఖీద్,మహిళా సంఘం సభ్యులు,నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన కౌన్సిలర్లకు సన్మానం

**సూర్య జగిత్యాల అర్బన్**



జగిత్యాల మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన 22 వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి రాజు, 21 వార్డు కౌన్సిలర్ సిరికొండ పద్మ సింగరవు, 2 వార్డు కౌన్సిలర్ దయల చంద్రకళ శంకర్ లనుసీతా రామాఆంజనేయస్వామి దేవాలయం కమిటీ సభ్యులు బుధవారం సన్మానించారు. ఈ మేరకు స్థానిక సీత రామాంజనేయ స్వామి ఆలయం విద్యానగర్లో అర్చకులు రంజిత్ అయ్య గారు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇనుగంటి అశోక్ రావు, అయిల్నేని వెంకట్ రావు, గంద్ర ప్రవీణ్ రావు, మునిందర్, కొండాడి నరసింగరావు, డ్రైవర్ శ్రీను, పైడిపల్లి రాఘవ రావు, తాంద్ర వెంకటేశ్వర్ రావు, శివనార్తి చిరంజీవి, బిట్టు దయాల శరత్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన డైరీ, కాలెండర్ ఆవిష్కరణ

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన డైరీ మరియు క్యాలెండర్‌ను జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి సుజాత చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సిబ్బంది కి మార్గదర్శనంగా నిలిచి అన్ని కార్యక్రమాలలో జిల్లాను ప్రగతి పతంలో నడిపిస్తున్నారని ప్రశంసించారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షులు లింగ రామ్మోహన్, కార్యదర్శి రాజశేఖర్ లను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సాగర్ రావు, సందీప్, హరి నాయక్,జ్యోతి ఎం ఓ సత్యనారాయణ, ఆరోగ్య విద్యా బోధకులు భువనేశ్వర్, శంకర్, శ్రీనివాస్ శ్రీధర్, రాజేశం ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# కోరుట్లలో అరుదైన శస్త్రచికిత్స

## - 6 కిలోల భారీ అండాశయ కణితి విజయవంతంగా తొలగింపు

**సూర్య కోరుట్ల**



కోరుట్ల పట్టణంలో అరుదైన వైద్య ఘటన చోటుచేసుకుంది. స్థానికంగా ఉన్న వాసుదేవ హాస్పిటల్‌లో 48 ఏళ్ల మహిళకు చెందిన సుమారు 6 కిలోల బరువున్న భారీ అండాశయ కణితిని వైద్యులు విజయవంతంగా తొలగించారు.గత కొంతకాలంగా తీవ్రమైన కడుపు ఉబ్బరం, నొప్పితో బాధపడుతున్న మహిళ చికిత్స కోసం ఆసుపత్రిని సంప్రదించగా, వైద్య పరీక్షల అనంతరం ఆమె అండాశయంలో భారీ పరిమాణంలో మ్యుసినస్ సిస్టిక్ నియోప్లాజమ్ (Large Mucinous Cystic Neopla sm of Ovary) ఉన్నట్లు గుర్తించారు. ఈ కణితి వేగంగా పెరిగి కడుపు లో ఒత్తిడి, అసౌకర్యం కలిగిస్తుందని వైద్యులు తెలిపారు. డా. మనోజ్ కుమార్ పసునూరి (ఎం.ఎస్) ఆధ్వర్యంలో వైద్య బృందం క్లిష్టమైన శస్త్రచికిత్స చేపట్టి, మహిళ కడుపు నుంచి సుమారు 6 కిలోల బరువున్న కణితిని సురక్షితంగా తొలగించింది. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని, త్వరలోనే పూర్తిగా కోలుకుంటారని వైద్యులు వెల్లడించారు.ఈ శస్త్రచికిత్సలో డా. విజయశ్రీ పసునూరి, డా. ప్రియాంక మరియు ఆసుపత్రి సిబ్బంది కీలక పాత్ర పోషించారు. వైద్యుల నైపుణ్యాన్ని రోగి కుటుంబ సభ్యులు, పట్టణ ప్రముఖులు అభినందించారు.వైద్యుల ప్రకారం, మ్యుసినస్ సిస్టిక్ నియోప్లాజమ్ అనేది అండాశయంలో ఏర్పడే ఒక రకమైన కణితి. ఇందులో మ్యూసిన్ అనే జిగట పదార్థం నిండి ఉండి, ఇవి వేగంగా పెరిగే అవకాశం ఉంటుంది. ప్రారంభ దశలో గుర్తించి శస్త్రచికిత్స చేయడం ద్వారా రోగికి పూర్తిస్థాయి ఉపశమనం లభిస్తుందని తెలిపారు.

# ఘనంగా రామకృష్ణ పరమహంస జయంతి

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

జగిత్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బుధవారము ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, కాళీ ఉపాసకులు, పరమ పూజ్యులు శ్రీ రామకృష్ణ పరమహంస జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామకృష్ణ పరమహంస యొక్క చిత్రపటాన్ని పూలమాలలతో అలంకరించి స్మరించినారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ యాద రామకృష్ణ మాట్లాడుతూ రామకృష్ణ పరమహంస తన బోధనలతో ఎంతోమందిని ప్రభావితం చేసి జ్ఞానాన్ని, జీవన మార్గాన్ని నిర్దేశించారని, ప్రతి జీవిలో దేవుడు ఉంటాడని మానవసేవయే మాధవసేవ అని, మతం ఏదైనా విశ్వాసంతో కూడిన భక్తి సత్ఫలితాలను అందిస్తుందని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి రామకృష్ణ పరమహంస అని పేర్కొన్నారు. రామకృష్ణ పరమ హంస శిష్యుడైన స్వామి వివేకానందుడు తన గురువు యొక్క బోధనలను ప్రపంచానికి చాటాలని



పశ్చిమ దేశాలకు ప్రయాణం చేసి భారతదేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేశాడని తెలిపినారు. అనంతరం ఇటీవల శాతవాహన యూనివర్సిటీ విడుదల చేసిన ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించినారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పల్లెర్ల నరేష్, ప్రిన్సిపాల్ కొక్కుల రాజేందర్ అధ్యాపక బృందం సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# జేఈఈ ఫలితాల్లో ఉత్తమ పర్సంటైల్ సాధించిన ఆల్ఫోర్స్ విద్యార్థులు

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



ఐఐటీ జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాల్లో జగిత్యాల అల్ఫోర్స్ ఐఐటీ అకాడమీ విద్యార్థులు జాతీయస్థాయిలో అత్యున్నత ప్రతిభ కనబరిచి ఉత్తమ పర్సంటైల్ సాధించారని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి తెలిపారు. అత్యధిక పర్సంటైల్ సాధించిన జగిత్యాల విద్యార్థిని జి. లాస్య రెడ్డి 96.87 నీ అభినందించారు. అదేవిధంగా ఎండి జబీరుద్దీన్ 88.03, ఎండి అజీబ్ ఖాన్ 86.34, జి సహస్ర 85.94, ఆర్ లావణ్య 85.17, బి తేజ 83.3, ఏ యశస్వి 81.34, ఈ సహ్రస 80.03 పర్సంటైల్ సాధించినట్లు పేర్కొన్నారు. రెండో విడత ఫలితాల్లో విద్యార్థులందరూ కూడా ఇంకా మంచి పర్సంటైల్తో అఖండ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

# కౌన్సిలర్‌గా గెలిచిన ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడికి సన్మానం

**సూర్య మెట్‌పల్లి**



మున్సిపల్ ఎన్నికల్లో 20వ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందిన టీయుడబ్ల్యూజే ఐజేయు మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా గౌరవ అధ్యక్షుడు మాసుల ప్రవీణ్‌ను ప్రెస్ క్లబ్ సభ్యులు బుధవారం ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా టీయూడబ్ల్యూజే ఐజేయు అధ్యక్షుడు డా: బూరం సంజీవ్, జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అజీమ్, ఉపాధ్యక్షులు జంగం విజయ్, అఫ్రోజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సాజిద్ పాషా, బొసెట్టి హరీష్, గౌరవ సలహాదారులు దాసం కిషన్,క్యాషియర్ మక్సూద్, జాయింట్ సెక్రెటరీ పుంద్ర శశికాంత్ రెడ్డి, పింజరి శివ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎండి సమీయుద్దీన్, కార్యవర్గ సభ్యులు పొనగాని మహేందర్, కుర్ర రాజేందర్,యానం రాకేష్,రఫీ ఉల్లా, సోహెల్, హైమద్, ముత్యాల రమేష్, ఓంకారి శ్రీనివాస్,బొల్లం రాజు,మాజీ అధ్యక్షుడు ఆగ సురేష్ సభ్యులు ఆదిల్ పాషా, రమణ, ఏసమేని గణేష్, ఎండి అభిద్, శశి కుమార్, అమ్ముల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఛైర్మెన్‌కు విశ్రాంత ఉద్యోగుల సంఘం సన్మానం

**సూర్య,రాయికల్**



రాయికల్ మండలం తెలంగాణ రాష్ట్ర విశ్రాంతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన రాయికల్ మున్సిపల్ ఛైర్మెన్ కట్కం రవీందర్‌కు బుధవారం శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు తిరుకోవెల వెంకట నర్సయ్య,అధ్యక్షులు ఏనుగంటి రాములు, కార్యదర్శి బత్తిని నిరంజన్, కోశాధికారి సింగని రాందాస్, అసోసియేట్ అధ్యక్షులు ఆశన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ నర్సయ్య పాల్గొన్నారు.

# 11 ఏళ్ల తర్వాత న్యాయం

## -ఎస్సీ మహిళ ను మోసం చేసిన వ్యక్తి కి 5 ఏళ్ల జైలు, రూ.4 వేలు జరిమాన, రూ.3 లక్షల పరిహారం

**సూర్య-గోదావరిఖని**

ఇక్కడి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మోసం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నిందితుడికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ బుధవారం కోర్టు కీలక తీర్పు వెలువరించింది. అదనంగా రూ.4,000 జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. వివరాల్లోకి వెళితే 2015లో నమోదైన ఈ కేసు కరీంనగర్ జిల్లా పరిధిలోని 3వ అదనపు జిల్లా అండ్ సెషన్స్ కోర్టు, ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ న్యాయస్థానంలో విచారణకు వచ్చింది. విచారణ అనంతరం న్యాయమూర్తి ఏ.నీరజ నిందితుడు ముత్యాల సుదర్శన్‌కు శిక్ష ఖరారు చేశారు. ఎఫ్‌సీఐ నివాసురాలైన గంగారపు శారదాదేవితో 2008లో పరిచయం ఏర్పరు చుకున్న




నిందితుడు 2010లో పెళ్లి చేసుకుని ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి డబ్బులు తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం ఆమెను గర్భవతిని చేసి, కులదూషణలు చేస్తూ సంబంధం లేదని చెప్పి మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ) సెక్షన్లు 493, 496, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం సెక్షన్లు 3(1)(x), 3(2)(v) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పటి దర్యాప్తు అధికారి డీఎస్పీ ఎస్.మల్లారెడ్డి ఆధ్వర్యంలో సమగ్ర దర్యాప్తు జరిపి, సాక్ష్యాధారాలను కోర్టులో సమర్పించడంతో నిందితుడికి శిక్ష విధించడంలో ప్రాసిక్యూషన్ బృందం కీలక పాత్ర పోషించింది. ప్రభుత్వ తరఫున ఏపీపీ కోలా ఝాన్సీ వాదనలు వినిపించారు. బాధితురాలికి న్యాయం జరిగేలా కృషి చేసిన పోలీసు అధికారులను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

## ముత్తారం, మచ్చుపేట గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు

**సూర్య ముత్తారం**





ముత్తారం మండల కేంద్రంతోపాటు మచ్చుపేట గ్రామంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు బుధవారం పారిశుద్ధ్య పనులు చేయించారు. ముత్తారం సర్పంచ్ సుధాటి రవీందర్ రావు ఆధ్వర్యంలో గ్రామంలోని దెబ్బతిన్న సిమెంట్ రోడ్లకు ప్యాచ్ వర్క్ పనులు పూర్తి చేసి, వీధి దీపాలను పునరుద్ధరించారు. అలాగే, పారిశుధ్య పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ గ్రామ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నారు. మరోవైపు, మచ్చుపేట సర్పంచ్ చిలివేరి జ్యోతి-లక్ష్మణ్ గ్రామ ప్రజల ఆరోగ్యం దృష్ట్యా మురికి కాలువలను శుభ్రం చేయించారు. వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో జరిగిన ఈ పనుల పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సౌకర్యార్థం సర్పంచ్‌లు తీసుకుంటున్న ఈ చర్యలను ప్రజలు అభినందిస్తున్నారు.

## దుమ్ము తో రోగాలు వచ్చి ఇల్లు వదిలి వెళ్తున్నారు...

### - టిప్పర్లు ఆపి గ్రామస్తుల ఆందోళన - రోడ్డు పై వంట వార్పు

**సూర్య - పెద్దపల్లి రూరల్**





అధిక లోడ్ తో వెళుతున్న భారీ వాహనాలు, టిప్పర్లు, లారీలతో దుమ్ము వచ్చి రోగాల బారిన పడి గ్రామాన్ని వదిలి వెళ్తున్నారని గ్రామస్థులు వాపోయారు. అధిక లోడు తో రోడ్డు పూర్తిగా చెడిపోయి నానా తంటాలు పడుతున్నామని పెద్దపల్లి మండలం కుర్మపల్లి గ్రామస్థులు బుధవారం రోడ్డు పై ఆందోళన చేశారు. రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. రోడ్డుపై వంటా వార్పుతో నిరసన వ్యక్తం చేశారు. లారీల వల్ల రోడ్లు అధ్వానంగా తయారవుతున్నాయని గ్రామస్థులు కంకర, బోల్డర్, మట్టి లారీలను అడ్డుకున్నారు. రెండు సంవత్సరాల నుండి గ్రామస్తులు అనేకసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని గ్రామ సర్పంచ్ గొర్రె లక్ష్మి లింగయ్య, ఉప సర్పంచ్ బిటి అశోక్, వార్డ్ సభ్యులు ఆరోపించారు. మా సమస్యను వెంటనే పరిష్కరించకపోతే పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ నిరసనను ఇంకా ముందుకు తీసుకపోతామని గ్రామస్తులు తెలిపారు. ధర్మారం ఎక్స్ రోడ్ లో ఉన్న క్రషర్ల వల్ల కూడా ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అంతేకాక అతివేగం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయించాలని, అలాగే ప్రతి రోజు రోడ్డు పై ట్యాంకర్ సహాయంతో నీళ్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మామిడి శ్రీనివాస్ , చిప్ప శ్రీనివాస్, మ్యడగోని తిరుపతి, బిటి శేఖర్, సారయ్య, జడల అంజయ్య , గుర్రాల లక్ష్మణ్, అంజి బత్తుల తదితరులు పాల్గొన్నారు.

## యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ క్యాంపెయిన్ తెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ క్యాంపెయిన్ తెలంగాణ 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర సమాచార కమిషనర్లు పీవీ శ్రీనివాస రావు, దేశాల భూపాల్, మోహసిన ఫర్వీన్, బైరెడ్డి అయోధ్య రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. బుధవారం గోదావరిఖనిలోని సింగరేణి ఇల్లందు గెస్ట్‌హౌస్ లో ఈ కార్యక్రమం జరిగింది. స్టేట్ కో కన్వీనర్ సోమ వెంకటేశ్వర్లు, మహిళా స్టేట్ కో-కన్వీనర్ ఎస్ లక్ష్మిల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం పెద్దపల్లి జిల్లా, కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో సమాచార హక్కు చట్టం 2005 అమలు తీరులో ఎదురవుతున్న తీవ్ర ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర సమాచార కమిషనర్లకు వారు వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల వివరాల బోర్డులు లేకపోవడం, 30 రోజుల గడువులోగా సమాచారం ఇవ్వకపోవడం, అప్పీళ్లు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటం వంటి సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని, రికార్డులను డిజిటలైజేషన్ చేయాలని, సెక్షన్ 4 కింద స్వచ్ఛంద ప్రకటనలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ జంగచక్రధర్ రెడ్డి, కో కన్వీనర్ ఆరెల్లి మల్లేష్, ఎం.రాజేశం, ఎస్.నాగేశ్వర్, జి.సురేష్, ఎండి.తాజుద్దీన్ బాబా, జి. చిరంజీవి, జి. చంద్రమౌళి, పి. రాజ్ కుమార్, ఓల్లే తిరుపతి కె. గుణకరం తదితరులున్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం...

**సూర్య - పెద్దపల్లి రూరల్**



మండలంలోని అందుగులపల్లిలో ప్రత్యేక అభివృద్ధి నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్ ప్రారంభించారు. గ్రామంలో ప్రజల సౌకర్యార్థం అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంజయ్య, ఉపసర్పంచ్ తలారి స్వప్న, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి గీతావాణి తదితరులు పాల్గొన్నారు.

## నూతన గ్రామ పంచాయతీ భవనంకు భూమి పూజ

**సూర్య ముత్తారం**



ముత్తారం మండలం జిల్లెలపల్లి గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు సంప్రదాయబద్ధంగా ముగ్గు పోసి, భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం, మండల అధ్యక్షులు దొడ్డ బాలాజీ, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు వాజిద్ పాషా, ఓబీసీ సెల్ మండల అధ్యక్షులు అల్లం కుమారస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముగ్గు పోసి, భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గడ్డం రాజేశం మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఉపసర్పంచ్ జన్నె శ్రీవాణి ప్రవీణ్ మాట్లాడుతూ.. ఈ భవన నిర్మాణం గ్రామ ప్రగతిలో ఒక ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు గడ్డం గట్టయ్య, చిగురు పోచయ్య, రుద్రవేణ రేవతి-శంకర్, సిద్ధ సమ్మయ్య, అనవేన తిరుమల-సాయికుమార్ తదితరులున్నారు.

## కాంగ్రెస్ సీనియర్ నేత సర్వర్ పాషా మృతి పార్టీకి తీరని లోటు

### - కడార్ల శ్రీనివాస్

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



పెద్దపల్లి పట్టణం 9వ వార్డు కౌన్సిలర్ నదీమ్ తండ్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సర్వర్ పాషా ఇటీవల మృతి చెందడంతో, వారి కుటుంబాన్ని పెద్దపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కడార్ల శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సర్వర్ పాషా సేవలను గుర్తు చేసుకుంటూ, ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కమ్మగోని చౌదరి గౌడ్, యువజన కాంగ్రెస్ పెద్దపల్లి మండల ఉపాధ్యక్షులు అరగొండ రాజ్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఈర్ల ప్రవీణ్, సిరిసిల్ల శంకర్, ముస్తాక్ భాయ్, కనుకుంట్ల సదానందం, జార్జి పాల్గొన్నారు.

## శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

### - డిడబ్ల్యువో వేణుగోపాల్

**సూర్య - పెద్దపల్లి రూరల్**



గ్రామ పంచాయతీ రాజ్ చట్టం పై అవగాహన కోసం శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని డిడబ్ల్యువో వేణుగోపాల్ అన్నారు. మండలం లోని బ్రాహ్మణపల్లి రైతు వేదికలో వార్డు సభ్యుల శిక్షణ తరగతులకు ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్ తో కలిసి డి డబ్ల్యూ వో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ పాలన చట్టం లో వచ్చిన మార్పులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలుపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. అలాగే పరిశుద్య నిర్వహణ, ఉపాధి హామీ పనులు, అభివృద్ధి పనులను రికార్డు చేయాలని అన్నారు. శిక్షణ తరగతులకు హాజరైన వార్డు సభ్యులకు రుచికరమైన భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏ పీవో రమేష్ బాబు , సర్పంచ్ మేకల రోజారాణి, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## వార్డ్ మెంబర్ ను సన్మానించిన రత్నాపూర్ సర్పంచ్

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం పన్నూరు గ్రామానికి చెందిన వార్డు మెంబర్ భాస్కర్ల అరుణ ను బుధవారం రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ పివీరావు సన్మానించారు. ఆమె రత్నాపూర్ గ్రామానికి రాగ శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాద్రపు ప్రవళిక- ప్రశాంత్, వార్డు సభ్యులు పబ్బ స్రవంతివెంకటేష్, జక్కుల పద్మ చందన్, బత్తిని ప్రశాంత్, అల్లి రమేష్, పున్నశీ మణి తేజ, జుట్టు యశోద సత్యనారాయణ, బత్తుల రాజమణి రమేష్ లు ఉన్నారు.

# సంఘం (ఆర్ఎస్ఎస్) ఎవ్వరికీ వ్యతిరేకం కాదు

## - ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ కార్యకారిణి సభ్యులు రామ్ మాధవ్ జి

**సూర్య కరీంనగర్**

సంఘం ఎవ్వరికీ వ్యతిరేకం కాదని,ప్రతి ఒక్కరూ దేశాన్ని ప్రేమించాలని, దేశ ఉన్నతి కోసం పని చేయాలని ఆర్ఎస్ఎస్ కోరుకుంటుందని అఖిల భారతీయ కార్యకారిణి సభ్యులు రామ్ మాధవ్ జి అన్నారు.సంఘ శతజయంతిలో కరీనగర్ పట్టణంలో ప్రతిష్టిత వ్యక్తుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రధాన వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ సంఘాన్ని అర్థం చేసుకోవటం కష్టం, అపార్థం చేసుకోవటం సులువని అన్నారు. సంఘం కొత్త సిద్ధాంతాన్ని చెప్పటం లేదని ప్రాచీన కాలం నుండి వస్తున్న సాంస్కృతిక పరంపర నుండి వికసించిన అంశాలనే చెబుతుందని తెలిపారు.వేదాలు,పురాణాలు,ఉపనిషత్తులు,భగవద్గీత, రామాయణ, మహాభారతాల పరంపరలోని



అంశాలే సంఘం చెప్తున్న సిద్ధాంతమని చెప్పారు. ఇదే ఆలోచనతో అరవింద ఘోష్, బాలగంగాధర తిలక్,మహాత్మా గాంధీ, అంబేద్కర్‌లు కూడా పని చేశారని చెప్పారు. డాక్టర్ హెడ్గేవార్ జీ అదే పరంపరలో సంఘ్‌ను స్థాపించారన్నారు. సంఘం వందేళ్ల ప్రయాణాన్ని నాలుగు దశలుగా చెప్పుకోవచ్చని మొదటి దశలో సంఘము అవరోధాన్ని, వ్యతిరేకతని ఎదుర్కొందని, రెండవ దశలో ప్రజల్లోకి వెళ్లి అనుకూల వాతావరణాన్ని నిర్మించుకుందని, మూడవ దశలో సామాజిక సమస్యల పరిష్కారానికి నడుం బిగించిందని, దీంతోనే వివిధ క్షేత్రాలు ప్రారంభమయ్యాయన్నారు. నాలుగవ దశలో దేశంలోని సామాన్య జన బాహుళ్యంలోకి సంఘం విస్తరించిందని సోదాహరణంగా చెప్పారు. సంఘం పని పూర్తి కాలేదని, భవిష్యత్ భారత నిర్మాణం కోసం పంచ పరివర్తనను ముందు నిలిపిందని వివరించారు.ఈ సమావేశంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ విభాగ్ సహసంఘచాలకులు డాక్టర్ చక్రవర్తుల రమణాచారి,జిల్లా సంఘచాలకులు నిరంజన చారి, జిల్లా సహసంఘచాలకులు ఎలగందుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి

**సూర్య, హుజురాబాద్**



వార్డు సమస్యలతో పాటు మున్సిపల్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని అన్నారు. బుధవారం ఆమె 30 వార్డులో పర్యటించారు. తనకు ఎన్నికల్లో ఓటు వేసి మద్దతు పలికిన పలువురికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను సీనియర్ కరాటే మాస్టర్ ఐవి రమేష్ దంపతులు, పలువురు శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... రాజకీయాలకు తాను కొత్తనైన ప్రజల అభిమానంతో విజయం సాధించానని, వార్డు సమస్యలు తన దృష్టికి తీసుకొని వస్తే పరిష్కారం చేయడంలో ముందుశీటా అన్నారు. ఈమె వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

**- మూడో వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటా...**

హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని మూడో వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటానని వార్డు సమస్యల పరిష్కారం వెంట వెంటనే చేస్తానని మూడో వార్డు కౌన్సిలర్ గందె శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన వార్డులో ప్రజలను కలుసుకొని తన విజయానికి కారణమైన పలువురిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల వరకే రాజకీయాలని, తర్వాత వార్డు ప్రజలంతా తనవాళ్లేనని, అందరి సమస్యల పరిష్కారం తన బాధ్యత అని అన్నారు. వార్డులోనే తన కార్యాలయం త్వరలో ఏర్పాటు చేస్తానని, ఎలాంటి సమస్య వచ్చిన కార్యాలయం వద్దకు వచ్చి తనకు తెలుపాలని ఆయన అన్నారు. చిన్న చిన్న సమస్యల కోసం మున్సిపాలిటి చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వార్డులోనే కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు సన్మానించారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్ ఎం. కుమారస్వామి, పలువురు బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## వీణవంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా 'ఫేర్‌వెల్' వేడుకలు

**సూర్య, వీణవంక**



స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశం బుధవారం ఘనంగా జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో కళాశాల ప్రాంగణం కోలా హలంగా మారింది. ప్రిన్సిపాల్ రాజిరెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ కే. రాజి రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ విద్య అత్యంత కీలకమైన దశ అని పేర్కొన్నారు. కష్టపడి చదివి తల్లిదండ్రులకు, గురువులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ ఏడాది కళాశాల ఉత్తీర్ణత శాతం పెంచేలా ప్రతి విద్యార్థి కృషి చేయాలని పిలుపునిచ్చారు.క్రమశిక్షణతో చదివి సమాజంలో ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు.ముఖ్య అతిథిగా హాజరైన వీణవంక గ్రామ సర్పంచ్ దాసరపు సరోజన రాజేంద్ర ప్రసాద్ మాట్లాడు తూ...గ్రామంలో ఉన్న ప్రభుత్వ కళాశాల సౌకర్యాలను సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల కలలను నిజం చేస్తూ, గ్రామానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. కళాశా లలో విద్యాబోధన అద్భుతంగా ఉందని,అధ్యాపకులు చెప్పే ప్రతి అంశాన్ని శ్రద్ధగా విని ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని జూనియర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో వీణవంక ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు పులి అశోక్ రెడ్డి, ఎలబాక స్కూల్ ఉపాధ్యాయులు సత్యం,బేతిగల్ జి.శ్రీనివాస్,ఘన్ముక్కుల మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు,కళాశాల గ్రంథపాలకుడు ఎన్.రామ్ మోహన్, అధ్యాపకులు భాస్కర్, శైలజ, శోభన్ బాబు, సుమలత, కరుణ, రవీందర్, స్వప్న, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# మంథని మున్సిపల్ చైర్మన్‌కు బాల్యమిత్రుల ఘన సన్మానం

**సూర్య మంథని**

మంథని మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన ఒడ్నాల శ్రీనివాసును తమ చిన్ననాటి మిత్రులు ఘనంగా సన్మానించారు. ఈ నెల 11వ తేదీన జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 11వ వార్డు కౌన్సిలర్‌గా విజయం సాధించి మంథని మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన ఒడ్నాల శ్రీనివాసును మంథని ఫ్రెండ్స్ క్లబ్‌లో చిన్ననాటి మిత్రులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తన మిత్రులైన శశి భూషణ్ కాచే, చంద్రుపట్ల రమణ కుమార్ రెడ్డి, కొత్త శ్రీనివాస్, రామడుగు వేణుగోపాల్, గట్టు రాము, అవధానుల ప్రసాద్‌లు మాట్లాడుతూ.. మంథని పట్టణ ప్రజలకు, వ్యాపారస్తులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని కోరారు. మునిసిపల్ చైర్మన్‌గా ఎన్నికైన ఒడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకంతో తనను చైర్మన్గా ఎన్నుకున్న పట్టణ ప్రజలకు, మున్సిపల్ కౌన్సిలర్లకు, తన ఎన్నికకు సహకరించిన ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీను బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, మంథని పట్టణాన్ని అన్ని విధాల సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త శ్రీనివాస్ గుప్తా, రాంపల్లి శశిధర్, విజయకుమార్, తిరుపతి, జయంత్, కుక్కడప సత్య నారాయణ, తల్లం శ్రీనివాస్, మార్వాక కిట్టు, ఓల్లాల శ్రీనివాస్, తల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## రూ. 20.80 లక్షలతో డ్రైనేజ్, సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

### - తొలి అభివృద్ధి కార్యక్రమం ప్రారంభించిన కార్పొరేటర్ పడాల శ్రీజ అజయ్

**సూర్య కరీంనగర్**



కరీంనగర్ నగర పాలక సంస్థ 64వ డివిజన్ పరిధిలో గత మూడు సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న మైత్రి హోటల్ ముందు నుంచి సర్కస్ గ్రౌండ్ వెనుక వైపు వరకు డ్రైనేజ్ మరియు సీసీ రోడ్డు నిర్మాణ పనులను రూ.20 లక్షల 80 వేల వ్యయంతో ఈ రోజు ఘనంగా ప్రారంభించారు. కార్పొరేటర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం 64వ డివిజన్‌లో చేపట్టిన తొలి అభివృద్ధి పనిగా ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ పడాల శ్రీజ అజయ్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కాలనీ ప్రముఖులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మైనార్టీ నాయకులు మరియు స్థానికులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ పడాల శ్రీజ అజయ్ మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజ్ మరియు రాకపోకల సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో ఈ పనులను చేపట్టినట్లు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ప్రజలకు నేరుగా ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం తన కర్తవ్యమని పేర్కొన్నారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి అయ్యేలా స్వయంగా పర్యవేక్షిస్తానని తెలిపారు. 64వ డివిజన్ సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ పనులు పూర్తయిన తర్వాత స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సులభమవడంతో పాటు డ్రైనేజ్ సమస్యలు పూర్తిగా పరిష్కారమవుతాయని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమానికి సహకరించిన కాలనీ ప్రముఖులు, పార్టీ నాయకులు, మైనార్టీ నాయకులు, అధికార యంత్రాంగం మరియు తనపై నమ్మకం ఉంచిన డివిజన్ ప్రజలందరికీ ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా కౌన్సిలర్‌ను సన్మానించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు

**సూర్య చొప్పదండి**



చొప్పదండి పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బత్తిని సంపత్ గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిలర్‌గా భారీ మెజార్టీతో గెలుపొందిన కొత్త సుమలతగంగారెడ్డిని బిఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతిపక్షంగా, పట్టణంలోని ప్రజా సమస్యల పరిష్కారంకై నిరంతరం పోరాడుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్, మాచర్ల సౌజన్య వినయ్ కుమార్, నలుమాచు రామక్రిష్ణ, కొత్తూరి మహేష్, యం.డి అజ్జు, మంద నర్సయ్య, లోక రాజేశ్వర్ రెడ్డి, వెల్మ నాగిరెడ్డి, సీపెల్లి గంగయ్య, యం.డి జహీరొద్దిన్, కొక్కుల రామ్మోహన్, గుండేటి రాజా రమేష్, బీసవేని రాజశేఖర్ గౌడ్, ముద్దం కుమార్, చొక్కల్ల తిరుపతి, భైర కన్నా, సత్తు నర్సయ్య, చంద్రయ్య, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తాడికల్‌లో పంచాయతీ స్క్రాప్ విక్రయం వివాదం

**సూర్య, శంకరపట్నం**



శంకరపట్నం మండలంలోని తాడికల్ గ్రామంలో గ్రామపంచాయతీకి చెందిన పాడైపోయిన బోరు మోటార్లు, ఇనుప స్క్రాప్ విక్రయం వివాదాస్పదంగా మారింది.ప్రభుత్వ ఆస్తులను సంరక్షించాల్సిన పాలకవర్గం వాటిని విక్రయించడంపై గ్రామంలో చర్చలు సాగుతున్నాయి.ఈ నెల 16న గ్రామంలో సుమారు 13 క్వింటాళ్ల ఇనుప స్క్రాప్‌ను రూ.39 వేలకు విక్రయించినట్లు సమాచారం. పంచాయతీ పాలకవర్గం తీర్మానం మేరకే స్క్రాప్‌ను విక్రయించినట్లు పంచాయతీ కార్యదర్శి హైమ తెలిపారు. అయితే టెండర్ ప్రక్రియను అనుసరించకుండా నేరుగా విక్రయించడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. పాలకవర్గంలోని ఒక వార్డు సభ్యురాలు ఈ విషయంపై ఎంపిడివోకు ఫిర్యాదు చేయడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో విక్రయించిన వస్తువులను తిరిగి గ్రామపంచాయతీ ఆధీనంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిసింది. పంచాయతీ పాలకవర్గం తీర్మాణాన్ని జిల్లా పంచాయతీ అధికారికి సమర్పించిన అనంతరం టెండర్ ప్రక్రియ ద్వారా విక్రయం జరగాల్సి ఉంటుందని ఎంపిడివో కృష్ణ ప్రసాద్ స్పష్టం చేశారు. విధి, విధానాలపై అవగాహన లోపం కారణంగా ఈ విక్రయం జరిగినట్లు ఆయన పేర్కొన్నారు.

# మాధకద్రవ్యాల నిర్మూలన సమిష్టి బాధ్యత

**- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

సూర్య కరీంనగర్ ప్రతినిధి

మాధకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. అధికారులతో పాటు ఉపాధ్యాయులు, యువత, తల్లి దండ్రులు సమిష్టిగా మత్తు పదార్థాల నిర్మూలనకు సహకరించాలని కోరారు. జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్, ఎక్సైజ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో మాధకద్రవ్యాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు జిల్లాలో సత్ఫలితాలను ఇస్తున్నాయని అన్నారు. పోలీస్, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో డ్రగ్స్ మూలాలను పెకిలించి వేయాలని పేర్కొన్నారు. ప్రైవేట్ మెడికల్ స్టోర్స్‌లో అమ్మకాలను పరిశీలించాలని డ్రగ్ ఇన్స్పెక్టర్ ను ఆదేశించారు. వైద్యుల చీటీ లేకుండా మత్తు కలిగించే మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని




ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, హాస్టళ్లు, కళాశాలలను సందర్శించి కేవలం డ్రగ్స్ పైనే కాకుండా మద్యపానం, ధూమపానం అనర్థాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించాలని అధికారులను సూచించారు. జిల్లాలో అనుమానిత ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని పోలీస్, ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనకు పోలీసు శాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. డ్రగ్స్ వినియోగం, రవాణా, అమ్మకం తదితర అంశాల్లో జనవరి 2025 నుండి జిల్లాలో ఇప్పటివరకు 37 కేసులు నమోదు చేశామని అన్నారు. 87 మంది నిందితులను అరెస్టు చేశామని తెలిపారు. జిల్లాలో 42 కిలోల 225 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. డాగ్ స్క్వాడ్ ద్వారా ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఇప్పటికే డ్రగ్స్ డిటక్షన్ కిట్ల ద్వారా తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లాలో డ్రగ్స్ వినియోగంపై ఉక్కు పాదం మోపుతామని అన్నారు. డ్రగ్స్ అమ్మకాలు, వినియోగం, రవాణా వంటి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## యునైటెడ్ తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఫర్ మైనారిటీస్ (యునైటెడ్ టీమ్) క్యాలెండర్ల ఆవిష్కరణ

సూర్య కరీంనగర్



తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్, తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేని చేతుల మీదుగా మైనారిటీ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి సంస్థ యునైటెడ్ తెలం గాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఫర్ మైనారిటీస్ (యునైటెడ్ టీమ్) యొక్క వాల్ క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్, తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్ యునైటెడ్ టీమ్‌కు, దాని రాష్ట్ర అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, సంస్థ ద్వారా మైనారిటీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారమవుతా యని ఆశాభావం వ్యక్తం చేశారు. మైనారిటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం యునైటెడ్ టీమ్ రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ షేక్ నిసార్ అహ్మద్ రాష్ట్రంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న మైనారిటీ ఉద్యోగులు తమ సమ స్యలను యునైటెడ్ టీమ్ దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. క్యాలెండర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ షేక్ నిసార్ అహ్మద్ తో పాటు కరీంనగర్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సయ్యద్ అసద్, మొహమ్మద్ హాజీ, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మొహమ్మద్ తురాబుద్దీన్, సూపరింటెండెం ట్ ఫహీమ్‌ద్దీన్, సయ్యద్ సాజిద్, మొహమ్మద్ రాయిస్ పాల్గొన్నారు.

## మార్చిలోగా లక్ష ఇందిరమ్మ ఇళ్లు

**- వి.పి. గౌతమ్**

సూర్య, తిమ్మాపూర్



తెలంగాణ గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి.గౌతమ్ ఐఏఎస్ బుధవారం కరీంనగర్ జిల్లాలోని తిమ్మాపూర్ మండలం రేణికుంట, అలుగునూర్ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్చి నెలా ఖరు నాటికి రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడిన ఆయన, ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారమే ఇళ్లు నిర్మించుకోవాలని, అనవసర ఖర్చులతో అప్పుల పాలు కావొద్దని సూచించారు. బిల్లుల చెల్లింపులో జాప్యం జరగకుండా చూడాలని, క్షేత్రస్థాయిలో ఇంజనీర్లు, కమిటీ సభ్యులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న ఇళ్లపై త్వరలోనే జీవో వస్తుందని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయి, జిల్లా హౌసింగ్ పీడీ కె.శ్రీనివాసు, ఎస్.ఈ ఈశ్వరయ్య, డీఈఈ వెంకటరమణ, ఏఈలు ప్రవీణ్, మహేందర్, సాయి శ్రీజ, ఇతర రెవెన్యూ, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

## అపర భద్రాద్రిలో సీల్డ్ టెండర్ బహిరంగ వేలం నిర్వహణ

సూర్య, ఇల్లందకుంట

అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఈ నెల 18 బుధవారం నాడు దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకులు పి. సత్యనారాయణ పర్యవేక్షణలో కొబ్బరికాయలు పూజా సామాగ్రి అమ్ముకొని హక్కు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునే హక్కులకు సంబంధించిన వేలాన్ని నిర్వహించారు. కొబ్బరికాయలు పూజా సామాగ్రి సంవత్సరం పాటు అమ్ముకుని హక్కు వేలంను కొడవటంచ గ్రామానికి చెందిన గోరంటల వరలక్ష్మి రూ. 9,70,116లకు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునే హక్కుకు సంబంధించిన వేలాన్ని వెలిచాల గ్రామానికి చెందిన బోయిని సంపత్ రూ. 4,56,500లకు వేలం పాట పాడడం జరిగిందని, ఇట్టి వేలానికి సంబంధించిన కాలపరిమితి మార్చ్ 1, 2026 నుండి ఫిబ్రవరి 28, 2027 వరకు అనగా ఒక సంవత్సరం పాటు ఉంటుందని ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు, ఆలయ కార్యనిర్వహణాధి కారి కందుల సుధాకర్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు ధర్మకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## జమ్మికుంట మున్సిపాలిటీకి కొత్త రక్తం ఎక్కించిన ప్రజలు...

**- 25 మంది మొదటిసారి ఎన్నికైన వారే...**

సూర్య, జమ్మికుంట




ఇటీవల జరిగిన జమ్మికుంట మున్సిపాలిటీ ఎన్నికలలో పట్టణ ప్రజలు 30 వార్డులలో 25 మందిని కొత్తవారిని ఎన్నుకొని పట్టణ పరిపాలనకు కొత్త రక్తాన్ని ఎక్కించారు. గతంలో కౌన్సిలర్‌గా గెలిచిన చందా రాజు, శీలం శ్రీనివాస్, బచ్చు మాధవి, పొనగంటి రాము, ములుగు ప్రణీతలకు మాత్రమే మున్సిపాలిటీలో కౌన్సిలర్‌లుగా పనిచేసిన అనుభవం ఉంది, మిగతా 25 మందిలో చైర్మన్ ములుగు దిలీప్‌తో సహా మొదటిసారి గెలిచిన వారు కావడం గమనార్హం. అయితే ఇందులో చైర్మన్ దిలీప్‌తో పాటు శ్రీపతి స్వర్ణలత కుతాడి తిరుపతి దిడ్డి కోమల నలుగురు మాత్రమే గతంలో కౌన్సిలర్లుగా పనిచేసిన వారి కుటుంబం నుండి ఎన్నికయ్యారు. వీరు మినహా మొత్తం 21 మంది కొత్తగా ఎన్నికైన సభ్యులే కావడం గమనార్హం ఇదే కాక గతంలో చైర్మన్లుగా, వైస్ చైర్మన్‌గా, కౌన్సిలర్‌గా, సర్పంచులుగా, ప్రజా ప్రతినిధులుగా పనిచేసిన వారిని వారి కుటుంబంలో నుండి పోటీ చేసిన వారిని 14 మందిని పట్టణ ప్రజలు ఓడించి రికార్డు సృష్టించారు. పాత నీరు పోయి కొత్తనీరు చేరినట్లుగా తయారైన జమ్మికుంట మున్సిపాలిటీ నూతన సభ్యుల పరిపాలనలో కొత్త పుంతలు తొక్కాలని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందివ్వాలని పారదర్శకంగా పరిపాలించాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

## కొండపల్కలకు జెఎల్ఎంను నియమించండి

సూర్య - మానకొండూర్



మండలంలోని కొండపల్కల గ్రామంలో జెఎల్ఎం పోస్టు ఖాళీ ఉన్నదని, వెంటనే జెఎల్ఎంను నియమించాలని బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు దూలం కిరణ్ గౌడ్, వార్డు సభ్యులు దూలం తిరుపతి గౌడ్, తుమ్మల భూమేష్ యాదవ్ కరీంనగర్ రూరల్ డిఈ తిరుపతికి బుధవారం వినతి పత్రం అందజేశారు. కొండపల్కల మేజర్ గ్రామ పంచాయితి కావడంతో జెఎల్ఎం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. గతంలో జెఎల్ఎంగా పని చేసిన ఉద్యోగి విద్యుత్ ప్రమాదంలో మరణించాడని, అప్పటి నుండి కొండపల్కల గ్రామానికి జెఎల్ఎంను నియమించలేదన్నారు. జూనియర్ లైన్ మెన్ లేక లైన్ మెన్ ఒక్కరే అన్ని కరెంటు పనులు చూసుకోవాల్సి వస్తుందన్నారు. జెఎల్ఎం పోస్టు ఖాళీగా ఉన్నందున అట్టి పోస్టును వెంటనే భర్తీ చేయాలని వారు వినతి పత్రంలో కోరారు.

## 50వ డివిజన్ ప్రజల రుణం తీర్చుకోలేనిది...

**- డివిజన్ సమగ్రాభివృద్ధి కోసం కృషి చేస్తా**
**- కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు**

సూర్య, కరీంనగర్




కరీంనగర్ పట్టణం 50 డివిజన్ ప్రజలు తనపై విశ్వాసం, నమ్మకంతో మున్సి పల్ ఎన్నికల్లో అందించిన విజయం జీవితంలో మర్చిపోలేనిదని, డివిజన్ ప్రజల రుణం తీర్చుకోలేనిదని, డివిజన్ సమగ్రాభివృద్ధి కోసం కృషిచేసి ప్రజల రుణం తీర్చుకునే ప్రయత్నం చేస్తానని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు అన్నారు. ఎన్నికల్లో విజయాన్ని అందించిన 50వ డివిజన్ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ బుధవారం రోజున కార్పొరేటర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్లోని పలు ప్రాంతాల్లో ప్రముఖులు బోయిన్పల్లి ప్రవీణ్ రావును అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా బోయిన్పల్లి ప్రవీణ్ రావు మాట్లాడుతూ 50 డివిజన్ ప్రజలు ఎన్నికల్లో తనపై చూపిన ప్రేమ, అభిమానం స్పష్టంగా ఎన్నికల్లో కనిపించిందని, ప్రజలు ఆశీర్వదిస్తేనే కార్పొరేటర్‌గా విజయం సాధించానని తెలిపారు. డివిజన్ ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా డివిజన్ సమగ్రాభివృద్ధి కోసం శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు.

## చిలుక వాగు కబ్జాలపై చర్యలేవి..!?

సూర్య, హుజురాబాద్

హుజురాబాద్ పట్టణ శివారులోని చిలక వాగుపై కొంత మంది కబ్జాలు చేస్తున్న అధికారులు తీసుకుంటున్న చర్యలేవి అని ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... హుజురాబాద్ పరిసర గ్రామాల రైతులకు సాగునీరు అందిస్తున్న చిలక వాగును కొంత మంది కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని అన్నారు. అక్రమ నిర్మాణాలపై గతంలో అధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు లేవని జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో రెవిన్యూ అధికారులు వచ్చి సర్వే చేశారని, కానీ సర్వే రిపోర్టు ఇప్పటి వరకు బహిర్గతం చేయలేదన్నారు. అధికారులు చూసిచూడనట్లు ఉండడం వల్ల చిలుక వాగు రోజు రోజుకు కబ్జాలకు గురవుతుందన్నారు. ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే అధికారులు వచ్చి పరిశీలిస్తున్నారని, కానీ చిలుక వాగు హద్దులు నిర్ణయించి వాగు పరిసర ప్రాంతాల్లో భూములు కలిగి ఉన్న రైతులకు నోటీసులు ఇవ్వలేదన్నారు. వాగు పక్కన వ్యవసాయం చేసుకోవడానికి అనుమతి ఉంటుంది గానీ పక్కా నిర్మాణాలు చేయడానికి అనుమతులు ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. అక్రమంగా నిర్మాణాలు చేస్తున్న పట్టించుకోని అధికారులు భారీ వర్షాల మూలంగా వరదలు వచ్చినప్పుడు ఆ ఇంట్లో ఉండే వారికి ఎలాంటి ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని అన్నారు. ఇప్పటికైనా అక్రమ నిర్మాణాలను ఆపి చిలుక వాగును పరిరక్షించాలని ఆయన కోరారు.

# ఇందిరమ్మ ఇండ్లను గృహప్రవేశాలకు రెడీ చేయండి..

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా మొదటి దశలో ప్రారంభించిన పనులన్నింటినీ మార్చి 31 లోగా పూర్తిచేసుకునేలా చూడాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి, హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి గౌతమ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఇండ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి లబ్ధిదారులు సంబురంగా గృహ ప్రవేశాలు జరుపుకునేలా ఇండ్లను రెడీ చేసి ఇవ్వాలని సూచించారు. బుధవారం కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూరు కోతి రాంపూర్ లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల ప్రగతిని క్షేత్రస్థాయిలో ఎండి గౌతం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తో కలిసి పర్యవేక్షించారు. ఇండ్ల నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. లబ్ధిదారులతో ఎండి స్వయంగా మాట్లాడారు. ఇంటి నిర్మాణ పనులకు ఎంత ఖర్చయింది.. ఎలా పనులు చేయిస్తున్నారు.. ఇసుక.. ఇటుక. .కంకర కు ఎంత ధర చెల్లిస్తున్నారు.. బిల్లులు సకాలంలో వస్తున్నాయా.. నిర్మాణ పనుల్లో ఏమైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా.. ఇప్పటివరకు పనులకు ఎంత ఖర్చు చేశారు.. పనులను ఏ విధంగా చేస్తున్నారు అని సమగ్రంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు అన్ని వివరాలు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు



చేయడంతో హ్యాపీగా ఫీల్ అవుతున్నామని వారు ఎండికి వివరించారు. సొంతి కల నెరవేరుతున్నదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎండి గౌతమ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లులు లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడ పెండింగ్లో పెట్టవద్దని పనులు మరింత వేగవంతంగా జరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మొదటి దశలో ప్రారంభించిన ఇండ్ల తుది పనులు మార్చి 31పూర్తి కావాల్సిందేనని పేర్కొన్నారు. పనులకు సంబంధించి ఎక్కడా జాప్యం జరగవద్దని అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అదేవిధంగా ఇసుక ఇటుక సిమెంటు కొంత చౌక ధరల్లో లభించేలా అధికారులు డీలర్లు నిర్వాహకులతో మాట్లాడాలని ఆదేశించారు. కొంత ధర తగ్గడం వల్ల లబ్ధిదారులకు చేయూతనందించినట్లు అవుతుందని అభిప్రాయపడ్డారు. దగ్గర్లో ఉన్న ఇసుక క్వారీల నుంచి ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక సరఫరా చేసేలా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. కరీంనగర్ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రోగ్రెస్ చాలా బాగుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తో పాటు అధికారులను అభినందించారు. బిల్లులు ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులకు వారం పదవులకు ఒకసారి బిల్లులు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. ఆ తర్వాత కరీంనగర్ లోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తో ఎండి గౌతమ్ సమావేశమయ్యారు. వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను రెడీ చేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇంకేమైనా పనులు పెండింగ్లో ఉంటే వాటిని పూర్తి చేయాలని పేర్కొన్నారు ఆయా కార్యక్రమాల్లో హౌసింగ్ పీడీ శ్రీనివాస్ ఆర్ అండ్ బి ఈఈ నరసింహ చారి తిమ్మాపూర్ తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డితో పాటు హౌసింగ్ అధికారులు పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయం..!

**- బాధ్యతతో పని చేస్తాం... కార్పొరేషన్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం... - వారంలో ఒక రోజు డివిజన్ లో పర్యటిస్తా..**

**- 66వ డివిజన్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మేయర్ కోలగని శ్రీనివాస్**

**సూర్య కరీంనగర్**

బిజెపి పై నమ్మకంతో కరీంనగర్ నగరపాలక సంస్థ బాధ్యతలను అప్పజెప్పిన పట్టణ ప్రజలందరికీ శిరస్సు వంచి నమస్కారాలు తెలియజేస్తున్నామని, ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతతో పని చేస్తామని, డివిజన్ సమస్యల పరిష్కారం కోసం వారంలో ఒక రోజు డివిజన్లో పర్యటిస్తనని, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని మేయర్ కోలగని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ పట్టణం 66 డివిజన్లో 13.5 లక్షల నిధులతో చేపట్టిన రోడ్డు,



డ్రైనేజీ పనులను డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్ వంగల పవన్ లతో కలిసి మేయర్ కోలగని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కోలగని శ్రీనివాస్ మాట్లా డుతూ కరీంనగర్ ప్రజలు తమ మీద పెట్టు కున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. నగర అభివృద్ధి కోసంకరీంనగర్ పట్టణ ప్రముఖులు, ప్రజల సూచనలు, అభిప్రా యాలను , సలహాలను పరిగణలోకి తీసుకొని ముందుకు కొనసాగు తామని తెలిపారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో నగరాన్ని మరింత అభివృద్ధి చేసే ఆలోచనతో ఉన్నామని , గతం కంటే మెరుగైన స్థితిలో కరీంనగర్ పట్టణాన్ని అభివృద్ధి దిశలోకి తీసుకు వెళ్లడానికి శాయ శక్తుల కృషి చేస్తామన్నారు. ప్రధానంగా నగరపాలక సంస్థలోని 66 డివిజన్లో మౌలిక వసతులకు పెద్దపీట వేస్తామని,ప్రజలకు రోడ్లు, డ్రైనేజీల సమస్యలకు విముక్తి కల్పించే లక్ష్యంతో సంకల్పంతో ఉన్నామన్నారు.కార్పొరేషన్లో విలీనమైన గ్రామాలో నెలకొన్న సమస్యలపై ప్రధాన దృష్టి సారించి, సాధ్యమైనంతవరకు సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తావ



ఎన్నారు. చెత్త సేకరణ, పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించేలా , రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని ఏ డివిజన్ కు తాగునీటి కొరత రాకుండా చూస్తామన్నారు.నగరపాలక సంస్థలో ప్రజలకు అవసరమయ్యే పనులు త్వరితగతిన వేగంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు . ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సునీల్ రావు , కార్పొరేటర్లు వంగల పవన్ , గుగ్గిలపు రమేష్, సోమిడి వేణు ప్రసాద్, బండ రమణారెడ్డి, కె పీ చంద్ర, శ్రీనివాస్, తాటి ప్రభావతి, కన్న కృష్ణ, బిజెపి మీడియా కన్వీనర్ కటకంలోకేష్, నాయకులు వరాల జ్యోతి,సురేష్, కొంపల్లి రామన్, శ్రీనివాస్ ,లడ్డు ముందడ, తనకు సాయి కృష్ణ , కైలాస నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ భవనంను.... ఉపయోగించరా...!?

**- వృధాగా మారిన బాలసదనం భవనం**

**సూర్య, హుజురాబాద్**

రాజుల సొమ్ము.... రాళ్లపాలు... అన్న చందంగా మారింది బాలసదనం భవనం... లక్షలాది రూపాయలతో నిర్మించిన బాలసదనం భవనం ఉపయోగంలోకి రాకపోవడంతో వృధాగా అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారింది. 2019 మార్చి 20న అప్పటి హుజురాబాద్ శాసన సభ్యులు మంత్రి ఈటల రాజేందర్ 1.15 కోట్ల రూపాయలతో బాలసదనం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణం పూర్తి అయినప్పటికి దానిని వినియోగంలోకి తేలేదు. సుమారు ఐదు సంవత్సరాలుగా భవన నిర్మాణం పూర్తయి వృధాగా ఉంటుంది. హుజురాబాద్ లో ఉన్న బాలసదనం భవనాన్ని కరీంనగర్ కు బదిలీ చేశారు. వృధాగా ఉన్న ప్రభుత్వ భవనాన్ని ఆ శాఖ ఉపయోగించకపోవడం, ఇతర శాఖలకు అయినా కేటాయించకపోవడం వల్ల భవనంలో అసాంఘిక కార్యక్రమాలు పెరిగిపోతున్నాయి. భవనానికి సంబంధించిన కిటికీలు, తలుపులు లేకుండా పోయాయి. వృధాగా ఉంటుండడంతో భవనంలో పరిసర ప్రాంతాల్లోని వారు మేకలు,



పశువుల కొట్టంగా ఉపయోగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బాలసదనం ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో ఆ భవనాన్ని ఇతర శాఖలకు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ ధనాన్ని వృధా చేయకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# భీమన్న సేవలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**సూర్య వేములవాడ**

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ఎల్ రమాదేవి స్వామివారి శేష వస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.



# చెరువులో దూకి మహిళా ఆత్మహత్య

**సూర్య మల్లాపూర్**

మండలంలోని ముత్యంపేట్ గ్రామానికి చెందిన పుల్లూరి నీల(60) గ్రామ శివారులోని చెరువులో దూకి బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ముత్యంపేట్ గ్రామానికి చెందిన పుల్లూరి బాలయ్య తో నీల కు వివాహం జరిగింది. కొడుకు రమేష్, కూతరు రమ సంతానం కలిగి వున్నారు. కొన్నేళ్ల క్రితం బాలయ్య మరణించగా నీల ఒంటరిగా వుంటోంది మూడు నెల్ల క్రితం ప్రమాదవశాత్తు క్రిందపడి ఆమె చేయి విరిగింది. ఈ క్రమంలో జీవితం పై విరక్తి చెందిన నీల బుధవారం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుందని మృతురాలి కూతురు రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



# ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరు మృతి.

**సూర్య సారంగాపూర్**

పెంబట్ల గ్రామ శివారు ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో ఒకరు మృతి చెందిన సంఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వెల్లటూరు మండల కేంద్రానికి చెందిన వకుళబరణం నరసింహ స్వామి 68 అనే వ్యక్తి దుబ్బరాజన్న జాతర లో స్వామి వారికి మొక్కులు చెల్లించుకుని తిరిగి స్వంత గ్రామానికి వెళుతుండగా అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా అతి వేగంగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో నరసింహ స్వామి మృతి చెందినట్లు పోలీస్ లు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# ఫ్యానుకు ఉరి వేసుకుని విద్యార్థి మృతి..

**- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ..**

**సూర్య బోయినపల్లి..**

మండలం వరదవెల్లి గ్రామం హామ్లెట్ దుబ్బపల్లిలో రామంచ సంజయ్ (18 సం॥లు) అనే వ్యక్తి హైదరాబాద్ అవంతి కళాశాలలో బి.టెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేక కాలేజీ ఫీజులు చెల్లించలేకపోవడంతో గత మూడు నెలలుగా ఇంటి వద్దే ఉన్నాడు. కుటుంబ ఆర్థిక సమస్యలు తన అక్క వివాహం విషయమై మనస్తాపానికి లోనవుతూ ఉండేవాడని తండ్రి తెలిపాడు. బుధవారం ఉదయం 07:30 గంటల సమయంలో చిన్న విషయంపై తండ్రి మందలించగా, సంజయ్ ఇంట్లో ఫ్యాన్కు టవల్తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని తండ్రి రామంచ అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోయినపల్లి ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.



# అలుగునూర్ గడ్డ... గులాబీ అడ్డ...

**- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్**

**సూర్య, తిమ్మాపూర్**

'అలుగునూర్ గడ్డ... గులాబీ అడ్డ' అని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. 8వ డివిజన్ అలుగునూర్ కార్పొరేటర్గా బీఆర్ఎస్ అభ్యర్థి కాల్వ మల్లేశం గెలుపొందగా, డివిజన్ అధ్యక్షుడు సల్ల మహేందర్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో విజయోత్సవ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో రసమయి మాట్లాడుతూ.. కరీంనగర్ కార్పొరేషన్లోనే మూడో భారీ మెజార్టీతో గెలుపొందడం సంతోషంగా ఉందన్నారు. రెండుసార్లు ఓడిపోయిన తనకు గ్రామ ప్రజలు ఆశీస్సులు



అందజేసి, 1095ఓట్ల మెజార్టీని అందజేసి ఆయన మీదున్న అభిమానాన్ని చాటారని హర్షం వ్యక్తం చేశారు. అలుగునూర్ కార్పొరేషన్లో విలీనమైన తర్వాత రెండుసార్లు ఎన్నికలు జరిగాయనీ, ఈ రెండుసార్లు అలుగునూర్లో బీఆర్ఎస్ జెండానే ఎగిరిందన్నారు. అనంతరం కార్పొరేటర్ కాల్వ మల్లేశం మాట్లాడుతూ, ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని ఏనాడు పోగొట్టుకోనని అన్నారు. ఇంత పెద్ద మెజారిటీ ఇచ్చిన గ్రామ ప్రజలకు తన జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. పట్టణ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, కార్పొరేటర్లు గుగ్గిళ్ల జయ శ్రీ, సుధగోని మాధవి, ప్రేమలత, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ స్వామిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్, నాయకులు పర్శరాములు, దాసం కమలాకర్, లంక రవి, అంజి తదితరులు పాల్గొన్నారు.

# సైదాబాద్‌లో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

**- 'అగ్ని అస్త్రం' తయారీపై శిక్షణ**

**సూర్య, జమ్మికుంట రూరల్**

రైతులు రసాయన ఎరువులను విడనాడి ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని ప్రాజెక్టు కో ఆర్డినేటర్ కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం జమ్మికుంట మండలంలోని సైదాబాద్ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో అగ్ని అస్త్రం తయారీ ఫీల్డ్ కో ఆర్డినేటర్ దాట్ల రమాదేవి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల సమక్షంలో పొలాల వద్దే 20 లీటర్ల అగ్ని అస్త్రాన్ని తయారు చేసి చూపించారు. ఈ సందర్భంగా అగ్ని అస్త్రం తయారీ



విధానాన్ని, పంటలపై దాని ప్రభావాన్ని రైతులకు వివరించారు. పురుగుల నివారణకు ఇది ఎంతో శక్తివంతంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. పెట్టుబడి బయట మార్కెట్లో దొరికే ఖరీదైన రసాయనాల అవసరం ఉండదని, భూమి తన సారవంతాన్ని కోల్పోకుండా ఉంటుందని, రసాయనాల వాడకం తగ్గడం వల్ల పర్యావరణ కాలుష్యం అదుపులో ఉంటుందని, విష రహిత ఆహారాన్ని సమాజానికి అందించవచ్చని అన్నారు. గ్రామంలోని ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపి, పెట్టుబడి లేని వ్యవసాయం వైపు మళ్లాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 28వరకు పన్నులు వసూళ్ళు పూర్తి చేయండి

**- మున్సిపల్ కమిషనర్**

**సూర్య, జమ్మికుంట2**

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి పన్నులు, నల్ల పన్నుల వసూళ్లలో వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి కమిషనర్ మహమ్మద్ అయాజ్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జమ్మికుంట మున్సిపాలిటీ పన్నుల వసూళ్లలో మొదటి స్థానం నిలిచిందని, అదే మాదిరిగా ఈ ఆర్థిక సంవత్సరం ఈ నెల 28వరకు పన్నుల వసూళ్లు పూర్తి చేయాలన్నారు. ఇప్పటికీ జమ్మికుంట మున్సిపాలిటీ టాప్ 5 స్థానంలో ఉందని ఈ నెల 28వరకు కష్టపడితే పన్నులు వసూళ్ళు పూర్తి చేయవచ్చు న్నారు. గత ఆర్థిక సంవత్సరంలో మూడు కోట్ల ఇంటి పన్ను వసూళ్లు చేసినందుకు గాను సి.డి.ఏం.ఎ నుండి నిధులు మంజూరు అయ్యాయని, ఇప్పుడు అదే మాదిరిగా పన్నులు వసూళ్ళు చేసి మరికొన్ని నిధులు మంజూరు చేసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. గతంలో ప్రజలు, మున్సిపల్ సిబ్బంది, ప్రజా ప్రతినిధుల సహకారంతో పన్నుల వసూళ్లలో మొదటి స్థానంలో నిలిచామని, ఈ ఆర్థిక సంవత్సరం పూర్తి స్థాయిలో పన్నులు వసూలు చేయడంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం పన్నుల వసూళ్ళు 100శాతం పూర్తి చేసిన మొదటి వార్డు వార్డు ఆఫీసర్ పోచంను ఆయన అభినందించారు. పన్నుల వసూళ్లలో సహకరిస్తున్న ప్రజలకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, ఎ ఇ వికాస్, జె.ఏ.ఓ రాజశేఖర్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారులు శ్రీధర్, రాజ్ కుమార్, దీపిక, రెవెన్యూ అధికారి భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ వాణి, శ్రీనివాస్ లతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



# వీణవంకలో గుడుంబాపై పోలీసుల ఉక్కుపాదం

**- బస్సులో తరలిస్తుండగా పట్టివేత**

**సూర్య, వీణవంక**



వీణవంక మండలంలోని చల్లూరు గ్రామంలో అక్రమ గుడుంబా విక్రయాలపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఆర్టీసీ బస్సులో గుడుంబా తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో ఎస్ఐ ఆవుల తిరుపతి తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఇద్దరు మహిళల వద్ద నుంచి సుమారు 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు.గ్రామంలో స్థావరాల ధ్వంసం అనంతరం చల్లూరు గ్రామంలో పర్యటించిన పోలీసులు, అక్కడ నిర్వహిస్తున్న గుడుంబా తయారీ స్థావరాలను (బట్టీలను) గుర్తించి పూర్తిగా ధ్వంసం చేశారు. అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్నట్లు గుర్తించిన పల్లపు రజిత, బోదాసు నారేశ్వరి, బోదాసు సంపత్ అనే ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ తిరుపతి మాట్లాడుతూ... మండలంలో అక్రమ మద్యం, గంజాయి, ఇతర డ్రగ్స్ విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత జీవితాలను నాశనం చేసే ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. ఈ దాడుల్లో ఎస్ఐతో పాటు ఏఎస్ఐ వెంకట్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ మోహన్, రఘుపతి రెడ్డి, కానిస్టేబుళ్లు కోమల్, సుమలత, మమత, ప్రవళిక, రమేష్ పాల్గొన్నారు.



## నేడు శివాజీ జయంతికి ఏర్పాట్లు

**సూర్య, హుజురాబాద్**

ఈ నెల 19వ తేది గురువారం రోజున చత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలను హుజురాబాద్ పట్టణంలోని ఆరె వాడలో ఏర్పాటు చేసినట్లు జయంతోత్సవ కమిటి నాయకులు భూసారపు శంకర్, బాపూరావు తెలిపారు. ఈ జయంతి సందర్భంగా చత్రపతి శివాజీ విగ్రహం వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్లు, జయంతోత్సవం పూర్తయిన తర్వాత ప్రజలకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

## సేవా పథంలో వాగేశ్వరి వాలంటీర్లు

**సూర్య, తిమ్మాపూర్**



వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మక్తపల్లె గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరం రెండో రోజు ఉత్సాహంగా కొనసాగింది. ఈ శిబిరంలో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి వివిధ సామాజిక అంశాలపై సమగ్ర సర్వే నిర్వహించారు. ముఖ్యంగా గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపరచడమే లక్ష్యంగా, తడి చెత్త మరియు పొడి చెత్తను వేరువేరుగా సేకరించడంపై గ్రామస్థులకు వాలంటీర్లు అవగాహన కల్పించారు. సేకరించిన చెత్తను మున్సిపల్ సిబ్బందికి మాత్రమే అందజేయాలని, దీనివల్ల గ్రామం ఆరోగ్యంగా ఉంటుందని వివరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో స్టేట్ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ మల్యాల సుజిత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన "రాజకీయాల్లో యువత పాత్ర" అనే అంశంపై వాలంటీర్లను ఉద్దేశించి ప్రసంగించారు. నేటి తరం యువత సామాజిక బాధ్యతతో రాజకీయాల్లోకి రావాలని, సమాజ మార్పులో కీలక పాత్ర పోషించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మక్తపల్లె గ్రామ సర్పంచ్ గండ్ల శ్రీనివాస్, ఉపసర్పంచ్ పెంట చంద్రయ్య, గ్రామ కార్యదర్శి పి. వంశీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆర్. సాయినాథ్ మరియు పెద్ద సంఖ్యలో వాలంటీర్లు పాల్గొన్నారు.

## మోరా(యిస్తున్న) ఆలకించిని రైల్వే అధికారులు

**సూర్య, గంగాధర**



గంగాధర మండ లం కరీంనగర్ జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్న రైల్వే గేటు ప్రయాణికులకు ఇబ్బందులకు గురి అవుతున్నారు. అత్యవసర అంబులెన్సులకు మరింత ప్రాణశంకటంగా మారుతుంది. రైలు వెళ్లిన గేటు మోరయించడం సర్వ సాధారణంగా మారింది. నిత్యం రద్దిగా ఉండే ఈ రహదారికి బ్రిడ్జి నిర్మాణం జరుగవలసిన అవసరం ఎంతైనా ఉందని ప్రయాణికులు కోరుతున్నారు. గేటు మోరయించడంతో అంబులెన్సు సైతం గంటల కొద్ది వేచి ఉండవలసిన పరిస్థితి ఎదురవుతుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రయాణికులు అవసరాలు దృష్టిలో ఉంచుకొని రైల్వే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## బావిలో పడి మృతి చెందిన రాజు కుటుంబానికి 'అమ్మ ఫౌండేషన్' బాసట

**సూర్య, వీణవంక**

ప్రమాదవశాత్తు మరణించిన నిరుపేద యువకుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు 'అమ్మ ఫౌండేషన్' ముందుకు వచ్చింది. వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఈర్నాల రాజు (తండ్రి: శ్రీనివాస్) పది రోజుల క్రితం రేగు పండ్ల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మరణించిన సంగతి విదితమే. ఈ విషాద ఘటన గురించి తెలుసుకున్న అమ్మ ఫౌండేషన్ (మల్లారెడ్డిపల్లి) ప్రతినిధులు బుధవారం బాధితుడి కుటుంబాన్ని పరామర్శించారు. వారి దయనీయ స్థితిని చూసి చలించిన ఫౌండేషన్ సభ్యులు, దాతల సహకారంతో ఆర్థిక సాయం, నిత్యావసరాలను అందజేశారు. అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గోనెల సమ్మన్న ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ముద్దసాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాతలు సేకరించిన మొత్తాన్ని అందజేశారు. బట్టల వ్యాపారి జగదీష్ రూ.1,000, ఎలుబాక రవీందర్ రూ.500, ముమ్మాడి సాంబమూర్తి రూ.500, దూలం కిరణ్ రూ.300, మొత్తం నగదు రూ.2,300 అందజేశారు. ఈ సందర్భంగా గోనెల సమ్మన్న మాట్లాడుతూ... మృతి చెందిన రాజు కుటుంబం అత్యంత నిరుపేద స్థితిలో ఉందని, దాతలు మానవత్వంతో ముందుకు వచ్చి ఆ కుటుంబాన్ని మరిన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గంధం సుమన్, రాయణవేణి రాజు, గోనెల అరవింద్, సాయి, పర్తం మురళి, మృతుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కోరుట్లలో కాంగ్రెస్ సంబరాల వెల్లువ

## - పట్టణం మార్మోగిన విజయోత్సవం

**సూర్య కోరుట్ల**

పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనమైన విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన తిరుమల వసంత గంగాధర్‌కు మద్దతుగా ఈ ర్యాలీ చేపట్టారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు భారీగా పాల్గొన్నారు. ర్యాలీకి ముఖ్య అతిథులుగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు హాజరయ్యారు. ముందుగా పట్టణంలోని వెటర్నరీ కళాశాల ఆవరణలో ఉన్న స్వర్గీయ మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం నుండి నంది చౌక్, కొత్త



బస్టాండ్, డైమండ్ హోటల్ మార్గంగా బైక్ ర్యాలీ నిర్వహించి తిరిగి కొత్త బస్టాండ్ వద్దకు చేరుకు న్నారు. అక్కడ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగ్ రావు మాట్లా డుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నదన్నారు. ఇటీవల జరిగిన సర్పంచ్ మరియు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు సాధించడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. కోరుట్లతో పాటు మెట్‌పల్లి మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం గర్వకారణమన్నారు. కాంగ్రెస్ పార్టీలో పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, అందు లో భాగంగానే తిరుమల వసంత గంగాధర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్‌గా నియమించామని తెలిపారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించేందుకు శ్రమించిన నాయ కులు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గెలుపోటములు సహజమని, పార్టీ బలోపేతం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిద్ ఉల్ అహ్మద్, కౌన్సిలర్లు మరియు మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## పులిదాడిలో నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి.

### - రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తీపిరెడ్డి తిరుపతిరెడ్డి.

**సూర్య, ఇల్లంతకుంట**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం తిప్పాపూర్, పెద్ద లింగాపూర్ గ్రామాల మధ్యలో వున్న గుట్టల శివారులో సోమవారం రాత్రి పులి దాడిలో మృతి చెందిన ఆవులకు, దూడ ల రైతులకు ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తీపిరెడ్డి తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు.బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ పెద్ద లింగాపూర్ గ్రామానికి చెందిన గుర్రాల మల్లయ్య, సుధాకర్ అనే రైతులకు చెందిన ఆవులు, లేగ దూడ లకు రూ.ఒక లక్ష చొప్పున రూ. 3 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.అడవులను, అడవి సంపదను,పాలకులు ధ్వంసం చేయడం వల్లేనే ఇలాంటి పులులు, కోతులు,అడవి జంతువులు జనార్యంలోకి వస్తున్నాయన్నారు.అడవులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. సిద్దిపేట జిల్లా లో ఐదు ఆవులను,రాజన్న సిరిసిల్ల జిల్లాలో మూడు ఆవులను చంపి ఒక దానిని గాయపరిచి,నెల రోజులు గా ప్రజల్ని నిద్రపట్టకుండా తీవ్ర మానసిక ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్న పులిని పట్టుకోవడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపిం చారు.డ్రోన్లు, శాటిలైట్ ల సాకారంతో డెడ్ లైన్ పెట్టి మనుషులను పట్టు కుని కాల్చి చంపే పాలకులకు, పులిని పట్టుకోవడంలో శ్రద్ద ఎందుకు లేదో అర్థం కావడం లేదని వాపోయారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సావనపెల్లి మల్లేశం, రాజు, రవి,అంజయ్య పాల్గొన్నారు.

## హనుమాన్ నగర్ పట్టణ అధ్యక్షుడిగా కోలుగురి సాయి కుమార్

**సూర్య-గోదావరిఖని:**

రామగుండం నియోజకవర్గంలోని హనుమాన్ నగర్ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడిగా కోలుగురి సాయి కుమార్ (చింటు)ను నియమిస్తూ మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జరిగిన స్థానిక మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై ధీటుగా పోరాడి రెండో స్థానంలో నిలిచిన చింటు పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేసిన నాయకుడిగా బీఆర్ఎస్ గుర్తించింది. ఈ నియామకంపై పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోరుకంటి చందర్ మాట్లాడుతూ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి హనుమాన్ నగర్‌లో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. తన నియామకానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కోలుగురి సాయి కుమార్ (చింటు) కృతజ్ఞతలు తెలుపుతూ, పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు.




## వైభవంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి జాతర.

**సూర్య,రాయికల్**



రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి జాతర మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు.ఈ వేడుకకి జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్,మాజీ మంత్రి జీవన్ రెడ్డి,రాయికల్ మున్సిపల్ చైర్మన్ కటకం రవి ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. పురోహితులు అంగడి భువనేశ్వర్, విక్రమ్ ఆధ్వర్యంలో రాజరాజేశ్వర స్వామి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో భాగంగా నిర్వహించిన రథోత్సవ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పురవీధుల గుండా రథాన్ని లాగుతూ భక్తులు 'ఓం నమశ్శివాయ' అనే నామస్మరణతో ఊరేగింపు నిర్వహించగా,మహిళలు మంగళ హారతులతో రథానికి స్వాగతం పలికి,కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా హాజరైన భక్తులకు శ్రీ రాజరాజేశ్వర స్వామి అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో రాయికల్ ప్రజా ప్రతినిధులు శ్రీధర్, నాగరాజు, శేఖర్,అల్లీపూర్ గ్రామ కార్యదర్శి శేఖర్,గ్రామ సర్పంచ్ ఎంబారీ గౌతమి వెంకటేష్, ఉప సర్పంచ్ గురులింగు వినయ్ కుమార్, ఆలయ అనువం శికులు నామని శేఖర్,లక్ష్మి నర్సయ్య సుమన్, అనుమల్ల రాజ్ కుమార్, వార్డు మెంబర్లు పరశురాం, ప్రశాంత్,సాయికుమార్, చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు మోఖీద్,సాగర్ రావు స్పందన,వేణు, అన్నదాన ట్రస్ట్ దాసారపు వేణు రావు, చిట్యాల భూమయ్య, బాలె చంద్రశేఖర్, సంజీవ్, గంగ శేఖర్ పొట్టవత్తిని నాగభూషణం, అనుమల్ల మల్లేశం, బండారి ముత్తయ్య, కారోబార్ రాజేందర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన జవ్వాజి హరీష్.

**సూర్య రామడుగు**



ప్రజా సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని రామడుగు మండల కేంద్రంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను రైతు వేదికలో చొప్పదండి శాసన సభ్యులు మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు 12,83 వేల 500 రూపాయల చెక్కులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జవ్వాజి హరీష్ చేతులమీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జవ్వాజి హరీష్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్ గౌడ్ మాజీ మండల అధ్యక్షులు బొమ్మరవేణి తిరుపతి ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మనీష్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పరశురాం గౌడ్ కట్ల శంకర్ చంద్రారెడ్డి తడగొండ హనుమంతు మాజీ సర్పంచ్ నరసయ్య మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేకల స్వామి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జవ్వాజి అజయ్ ఈశ్వర్ అరుణ్ అజయ్ బిట్టు రాంరెడ్డి పోచయ్య స్వామి మల్లేశం కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**




జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఈ సమావేశానికి హాజరయ్యారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నదులపై చెక్ డ్యాములు నిర్మించినచోట భద్రత దృశ్య డ్యాముకు ఎగువన, దిగువన 300 మీటర్ల వరకు ఇసుక తోడడం నిషేధమని, అధికారులు ఎప్పటికప్పుడు ఈ అంశాన్ని పర్యవేక్షించాలని అన్నారు. జిల్లా పరిధిలోని నదీ ప్రవాహాలకు సంబంధించి సరిహద్దులను పక్కాగా గుర్తించాలని, రికార్డు చేయాలని సూచించారు. ఇరిగేషన్, రెవిన్యూ, ఆర్.డబ్ల్యూ.ఎస్, టిజిఎండిసి, పోలీస్ అధికారులు సమన్వయంతో ఇసుక రీచ్ లను తనిఖీ చేయాలని అన్నారు. మన ఇసుక వాహనం ఆన్లైన్ పోర్టల్ లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇసుక కేటాయింపు పై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో గ్రౌండ్ వాటర్ డిడి శ్యాంప్రసాద్ నాయక్, డిపిఓ జగదీశ్వర్, జిల్లా జియాలజిస్ట్ ప్రసన్న, డి ఈ ఈ రాజేందర్, డిప్యూటీ డిఈ వేణుగోపాల్, మైండ్స్ ఏడి రాఘవరెడ్డి, టీజీఎండిసి పిడి శ్రీనివాస్, డిప్యూటీ ఈఈ రవి, ఆర్ఓ కనుక జ్యోతి పాల్గొన్నారు.

## కలలు కనండి లక్ష్యాన్ని నెరవేర్చుకోండి...డాక్టర్ బింగి రజిత

**సూర్య సిరిసిల్ల టౌన్**



సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని గీతా నగర్ గర్ల్స్ ఉన్నత పాఠశాలలో గతంలో చదివి ఉన్నత స్థితికి ఎదిగిన వారితో విద్యార్థులకు మోటివేషన్ ను నిర్వహించారు.గీత నగర్ హైస్కూల్లో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థి 1994 బ్యాచ్ డాక్టర్ బింగి రజిత సందర్శించటం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు నేను 10వ తరగతిలో ఉన్నప్పుడు ప్రతిరోజూ లక్ష్యం పెట్టుకొని చదివేదాన్ని. ఈరోజు నేర్చుకున్నది రేపటి నా భవిష్యత్తు"అని నమ్మేదాన్ని.అదే నన్ను ఇంటర్, మెడిసిన్,చివరకు డాక్టర్ వృత్తి వరకు తీసుకెళ్లింది. మీరు పెద్ద కలలు కనండి డాక్టర్,ఇంజనీర్, టీచర్, ఆఫీసర్ కావాలని ఏదైనా కావచ్చు. ఒక మంచి మనిషిగా ఎదగడం అత్యంత ముఖ్యం అన్నారు. గురువులు మీకు చూపే దారి అమూల్యం.వారి మాటలను గౌరవించండి.తల్లిదండ్రుల త్యాగాన్ని గుర్తుంచుకోండి.ముఖ్యంగా అమ్మాయిలుగా మీరు చదువుకుంటే, మీ కుటుంబం మాత్రమే కాదు, సమాజం మొత్తం ముందుకు వెళుతుందనీ అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లోకిని శారదా శాలువా, విమోచన,అర్చన,మంజుల,రవిలు డాక్టర్ రజితను శాలువా,మెమొంటోతో ఘనంగా సత్కరించారు.

## రైతులకు తగిన నష్టపరిహారం అందిస్తాం

### - ఆర్డీవో మధుసూదన్

**సూర్య వెల్గటూర్**

హైవే విస్తరణ నేపథ్యంలో భూముల కోల్పోయిన రైతులకు తగిన నష్టపరిహారం అందించి,న్యాయం చేస్తామని జగిత్యాల ఆర్డీవో పులి మధుసూదన్ గౌడ్ అన్నారు.బుధవారం వెల్గటూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ బండమీది కవిత గోపీ అధ్యక్షతన భూముల కోల్పోయిన రైతులతో విచారణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మధుసూదన్ మాట్లాడారు. వెల్గటూర్-రాజక్కపల్లి గ్రామాల పరిధిలోని రాష్ట్ర రహదారి పై పెద్దవాగు బ్రిడ్జి వెడల్పు ప్రక్రియలో భాగంగా వెల్గటూర్, రాజక్కపల్లి గ్రామాలకు చెందిన14 మంది రైతులకు సంబంధించిన ఏకరం ఏడు గుంటల భూమి కోల్పోతునట్లు గుర్తించి,రైతుల వివరాలు నమోదు చేశామని చెప్పారు. ప్రభుత్వం నిర్ణహించిన ధర ప్రకారం నష్ట పరిహారం అందిస్తామన్నారు.తమ భూములు విలువైనవని రోడ్డు విస్తరణకు తీసుకోవడం వల్ల భారీగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని కోరారు.రైతులు ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఆర్డీవో సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్. శేఖర్,రాజక్కపల్లి సర్పంచ్ దోరిశెట్టి మల్లేశం,ఉపసర్పంచ్ గంధ్ర ప్రతాప్ రావు, ఎంపిఓ కృపాకర్,ఆర్ఐలు దొంత రాజేశ్వరి, రాంరెడ్డి, ఇరిగేషన్ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# రాయ్‌పూర్‌లో మెరిసిన రామగుండం ఎన్‌టీపీసీ

## - టెక్నో గెలాక్సీ ప్రదర్శనలో ప్రతిభా ప్రదర్శన

## - ఐపిఎస్-2026లో ప్రత్యేక ప్రశంసలు, సదరన్ రీజియన్‌కు రన్నరప్ అవార్డు

**సూర్య-గోదావరిఖని**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్‌లో ఈనెల 13 నుంచి 15 వరకు ఎన్టీపీసీ సంస్థ నిర్వహించిన వార్షిక ఇండియన్ పవర్ స్టేషన్ల ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ కాన్ఫరెన్స్ (ఐపిఎస్-2026) టెక్నో గెలాక్సీ ఎగ్జిబిషన్‌లో ఎన్టీపీసీ రామగుండం, మరియు తెలంగాణ బృందం విశేష ప్రతిభ కనబర్చాయి. 'నాణ్యత, విశ్వసనీయతతో థర్మల్ ఉత్పత్తిని ఆప్టిమైజ్ చేయడం' అనే థీమ్‌తో నిర్వహించిన ఈ జాతీయ స్థాయి సదస్సులో దేశవ్యాప్తంగా ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాలు తమ సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలను ప్రదర్శించాయి. ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ విభాగం నుంచి మూడు సాంకేతిక మోడళ్లు



ఐపిఎస్-2026 ప్రదర్శనకు ఎంపికయ్యాయి. ఇందులో ఎంజీఆర్ టీమ్ అభివృద్ధి చేసిన 'సంపూర్ణ బ్లాక్ సిస్టమ్', ఎఫ్ఎం టెస్ట్‌పీపీ బృందం సమర్పించిన 'బెల్టెడోర్ ఎక్స్ మోడల్'కు ప్రశంసలు లభించాయి. విద్యుత్ ఉత్పత్తి సమయంలో ప్రధాన పాత్ర పోషించే కన్వేయర్ బెల్ట్ సిస్టమ్ పనితీరును మానిటర్ చేసి, సమస్యలను ముందే గుర్తించే సాంకేతిక నమూనకు పలువురు ప్రశంసలు లభించాయి. ఈ ఆవిష్కరణలు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరచడం, నాణ్యత, విశ్వసనీయతను పెంచడం వంటి అంశాల్లో వినూత్నతను ప్రతిబింబించాయి. సదరన్ రీజియన్‌కు రన్నరప్ గౌరవం టెక్నో గెలాక్సీ అవార్డ్స్‌లో సదర్న్ రీజియన్ మొదటి రన్నరప్ స్థానానికి ఎంపిక కావడం విశేషం. ఇది సాంకేతిక ప్రతిభ, ఆవిష్కరణల పట్ల ప్రాంతీయ బృందం నిబద్ధతను చాటింది. రామగుండం ఎన్టీపీసీ జాతీయ స్థాయిలో మరోసారి తన ప్రతిభను చాటుకోవడంతో ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

# యూరియా బుకింగ్‌లో 'మండల యూనిట్' రద్దు చేయాలి

## - రైతు క్లస్టర్ల వారీగా ఆన్‌లైన్‌కు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి

**సూర్య, వీణవంక**

ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన యూరియా ఆన్‌లైన్ బుకింగ్ విధానంలో 'మండలం యూనిట్'గా ఉండటం వల్ల సామాన్య రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జిల్లా ఎంపిటిసిల సంఘం మాజీ అధ్యక్షులు నాగిడి సంజీవ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత విధానం వల్ల వీణవంక మండల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన స్పందిస్తూ తక్షణమే యాప్‌లో మార్పులు చేయాలని కోరారు. మండలం మొత్తం కలిపి ఒకే యూనిట్‌గా ఉండటంతో సుమారు 26 గ్రామాల రైతులు ఒకేసారి ఆన్‌లైన్ ప్రయత్నం చేస్తున్నారని, దీనివల్ల 450 బస్తాల నిల్వ ఉన్నప్పటికీ, కేవలం ఒక్క నిమిషం లోపే బుకింగ్ పూర్తయి 'స్టాక్ లేదు' అని చూపిస్తోందని అన్నారు. వేల సంఖ్యలో రైతులు ఒకేసారి యాప్‌ను వాడటం వల్ల సర్వర్ సమస్యలు తలెత్తి, గ్రామీణ



ప్రాంత రైతులు బుకింగ్ చేసుకో లేకపోతున్నారని అన్నారు. సమయానికి యూరియా దొరకక పంటలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని, రైతులు రోడ్లపైకి వచ్చి నిరసన తెలపాల్సిన దుస్థితి దాపురించిందని ఆయన పేర్కొన్నారు. మండలం యూనిట్‌కు బదులుగా రైతు వేదిక క్లస్టర్ యూనిట్, రెవెన్యూ గ్రామాల వారీగా ఆన్‌లైన్ బుకింగ్‌కు అవకాశం కల్పించాలని, క్లస్టర్ వారీగా (3 లేదా 4 గ్రామాలు కలిపి) కేటాయింపులు చేస్తే, స్థానిక రైతులకు సులభంగా యూరియా దొరుకుతుందని పేర్కొన్నారు. దీనివల్ల పారదర్శకత పెరగడమే కాకుండా ఎక్కడి రైతులకు అక్కడ యూరియా సక్రమంగా అందుతుందని అన్నారు. జిల్లా కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే స్పందించి రైతు యాప్‌లో అవసరమైన సవరణలు చేయాలని సంజీవరెడ్డి కోరారు. రైతులకు ఇబ్బంది కలగకుండా క్లస్టర్ల వారీగా యూరియా పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# 11/6 కేనాల్ అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయాలి

## - మండల బిజెపి అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్

**సూర్య, ఇల్లంతకుంట**

కాళేశ్వరం 11ప్యాకేజి లోని 6వ కేనాల్ అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయాలని మండల బిజెపి అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. పెద్దలింగాపూర్ గ్రామంలో 12 గ్రామాల రైతులు



చేస్తున్న రిలే నిరాహార దీక్ష తొమ్మిదోవ రోజుకు చేరుకోగా,బుధవారం బిజెపి మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు మద్దతు పలికారు. అనంతరం ఈ సందర్భంగా మాట్లాడుతూ 11/6 కాలువ అసంపూర్తి పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇల్లంతకుంట,తంగళ్ళపల్లి మండలాలకు చెందిన 12 గ్రామాల రైతులు తొమ్మిది రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వానికి కనబడటం లేదా అని ప్రశ్నించారు. గత సంవత్సరం ప్రభుత్వ యంత్రాంగం పని పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో దీక్ష విరమించారు. హామీ ఇచ్చి సంవత్సరం గడుస్తున్న కాలువ పనులను చేపట్టకపోవడం చూస్తుంటే రైతులపై ఏ మేరకు చిత్తశుద్ధి వుందో తెలుస్తుందన్నారు. ప్రస్తుతం పొలాలు ఎండకుండా తక్షణమే నీటి సదుపాయం కల్పించాలని రైతులు దీక్ష మొద లుపెట్టారని గుర్తు చేశారు. ప్రభు త్వ యంత్రాంగం దిగివచ్చి వెంటనే నష్ట నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తే రైతుల అగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయ కులు మారవేణి రాజు, రైతులు కరికె నవీన్, పయ్యావుల బాలయ్య, గాదె మధుసూదన్, ఈర దేవరాజు, దుమల రాజు, ఎద్దు నర్సయ్య, కొమ్ము ల పరశురాములు, అక్కి శ్రీనివాసు ,సేరు ఎల్లం, జంగిటి కనకయ్య, జంగిటి మోహన్ పయ్యావుల మల్లేశం, కమటం రవి పాల్గొన్నారు.

# 186 ఖాళీ క్వార్టర్లు... తీసుకున్నవి 13 క్వార్టర్లు...

## - ఎందుకు ఇన్ని క్వార్టర్లు ఖాళీ ఉన్నాయి

**సూర్య, సెంటినరీ కాలనీ**

సెంటినరీ కాలనీలో 186 క్వార్టర్లు ఖాళీ ఉండగా కౌన్సలింగ్‌లో...తీసుకున్నవి 13 క్వార్టర్లు మాత్రమే. బుధవారం రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ ఆదేశాల మేరకు రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సెంటినరీ కాలనీలో గల క్వార్టర్ల కేటాయింపు కొరకు సెక్యూరిటీ కార్యాలయ ఆవరణలో క్వార్టర్ల కేటాయింపు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. మొత్తం 186 ఖాళీ క్వార్టర్లు ఉండగా, ఫ్రెష్ అలాట్మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ల కొరకు 61 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా, 15 మంది ఉద్యోగులు హాజరై, 13 మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు. వారికి త్వరలోనే క్వార్టర్ల కేటాయింపు పత్రాలు ఇస్తామని ఎస్వోటు జీఎం యం.రామ్మోహన్ తెలియజేశారు. ఇన్ని క్వార్టర్లు ఎందుకు ఖాళీగా ఉన్నాయని కార్మికులు చర్చించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు గంగాధర్, టి.మల్లిక, ఇంచార్జ్ పర్సనల్ విభాగాధిపతి వి.సునీల్ ప్రసాద్, సివిల్ విభాగం అధికారి



దుర్గం శ్రీనివాస్, ఎస్టేట్స్ విభాగం అధికారి మణిదీప్ రెడ్డి, క్వార్టర్ల విభాగం సిబ్బంది రమ్య రెడ్డి, దాసు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## తక్కల్లపల్లి ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ బహుకరణ

**సూర్య - కథలాపూర్**



మండలంలోని తక్కల్లపల్లి జిల్లా పరిషద్ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన అదునాల సాయాబు బుధవారం కంప్యూటర్, కుర్చీలను బహుకరించారు. సాయాబు అదే పాఠశాలలో చదివి హైదరాబాద్ లోని క్యూరియా ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తు తను చదువుకున్న పాఠశాలకు తన వంతు సహాయం చేయాలనే ఉద్దేశంతో విద్యార్థులకు నైపుణ్యం పెంపొందించే కంప్యూటర్లను, కుర్చీలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన ను సర్పంచ్ రాజ గంగారాం, గ్రామస్తులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నర్సయ్య, ఉపాధ్యాయులు రాజశేఖర్, ఖాలిద్ పాషా, హరినాథ్, చంద్రమౌళి సత్యనారాయణ, ప్రశాంత్, రఫీదా, విద్యార్థులు తదితరులు అన్నారు.

## కందికట్కూరు హై స్కూల్ పది విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల పరిశీలన

**సూర్య, ఇల్లంతకుంట**

మండలంలోని కందికట్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను పరిశీలించారు.10 వ తరగతి విద్యార్థుల ఎఫ్ఏ నోట్ బుక్కులను,సబ్జెక్టుల మార్కులను పరిశీలించారు. ఎంఇఓ సి హెచ్ శ్రీనివాస్ గౌడ్, వల్లంపట్ల హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు టీం లీడర్ గాడి గోవర్ధన్, దాచారం ఉపాధ్యాయులు టి.నరేందర్ రెడ్డి, అంతగిరి ఉపాధ్యాయులు పరీద్, ఉపాధ్యాయులు వున్నారు.

## జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపాల్

**సూర్య, సెంటినరీ కాలనీ**



సీఎం కప్ రెండవ దఫా జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులను ప్రిన్సిపాల్ బి.విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఉదయ్ కుమార్ అభినందించారు. బుధవారం కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సుల్తానాబాద్‌లో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ, సైక్లింగ్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు. అలాగే జిల్లా జట్టుకు ఎంపికై రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వెళుతున్న సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సైక్లింగ్‌లో ఎం.మైత్రి, ఇ.సృజన, వాలీబాల్లో కె.విజేత, బి అనుశ్రీ, కబడ్డీ డి. అక్షయ, బ్యాడ్మింటన్‌లో ఎం. పవిత్ర, ఎం.మైత్రిలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. అలాగే బాలుర కబడ్డీలో ఎల్.సత్యసాయి, బి. లక్ష్మణ్ రాథోడ్, బి.శ్రీనివాస్, సిహెచ్.ప్రభాస్, బి.రఘుపతి, వాలీబాల్ టి.సాయి, జె.జనార్ధన్, డి.భరత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి సుమన్, ఫిజికల్ డైరెక్టర్లు పింగిళి కృష్ణారెడ్డి, జి.సునీల్ కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## నేడు ఇల్లంతకుంట మండలానికి ఎమ్మెల్యే రాక

### - మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోమటిరెడ్డి బాస్కర్ రెడ్డి

**సూర్య, ఇల్లంతకుంట.**

నేడు గురువారం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి మానకొండూరు ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ రానున్నట్లు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోమటిరెడ్డి బాస్కర్ రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. అంతగిరి గ్రామంలో రూ.1.50 కోట్ల వ్యయంతో బ్రిడ్జి పనులకు భూమిపూజ, వెంకట్రావుపల్లిలో అంగన్వాడీ కేంద్రభవనం,సోమారపేట గ్రామంలో బస్ షెల్టర్ & కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం, రేపాకలో ఆరోగ్య ఉపకేంద్రం మరియు అంగన్వాడీ భవనం,గూడెపుపల్లె గ్రామపంచాయతీ భవనం, ఇల్లంతకుంటలో అంబేద్కర్ చౌరస్తా సుందరికరణ పనులకు, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద రూ.15 లక్షలతో కాంపౌండ్ వాల్, రైతు వేదిక వద్ద కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొంటాడు. అనంతరం ఇల్లంతకుంట రైతు వేదికలో ముఖ్యమంత్రి సహాయ నిధి, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, ట్రై సైకిళ్ల పంపిణీ వుంటుందని తెలిపారు.ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# మహిళలకు సామాజిక భద్రత కోసం కృషి చేయాలి

## - స్టేట్ సెర్ప్ జెండర్ ప్రాజెక్టు డైరెక్టర్ జెమున

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

ఈ ఆధునిక దేశంలో మహిళలు ఇంకా వివక్షను ఎదుర్కొవడం జరుగుతుందని, వారికీ సరియైన గుర్తింపు లభించడం లేదని అందుకోసం మహిళల కోసం, వారి హక్కుల కోసం, వారి రక్షణ కోసం సెర్ప్ ఆధ్వర్యంలో జిల్లా,మండల, గ్రామ మహిళ సమాఖ్య ల ఆధ్వర్యంలో జెండర్ రిసోర్స్ కేంద్రాలను ఏర్పాటు చేసి అందులో జెండర్ సఖీ కమిటీ ల ద్వారా కృషి చేయడం జరుగుతుందని స్టేట్ సెర్ప్ జెండర్ డైరెక్టర్ జెమున అన్నారు. జగిత్యాల జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల సమాఖ్య పదధికారులకు, సోషల్ యాక్షన్ సభ్యులకు ఏపియం లకు జెండర్ రిసోర్స్ సెంటర్ నిర్వహణ పై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగినది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు మహిళలు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలు, వేధింపుల పట్ల వారికీ అండగా ఉండుటకు మహిళ సమాఖ్య ల ద్వారా వారికీ తోడుగా ఉండేలా, ముఖ్యశీగా గృహ హింస, వరకట్న వేధింపులు, ఈవ్ టీజింగ్, అత్యాచారాలు, అక్రమ రవాణా తదితర అంశాలు



ఎదురైనప్పుడు బాధితులకు సత్వరా న్యాయం జరిగేలా, అలాంటి అన్యాయాలు జరగకుండా జెండర్ కమిటీ సభ్యులు చూడాలని, స్థానిక సంస్థల సహకారం అంటే పోలీసు వారితో, న్యాయ సలహాలు తదితరుల సహకారం తో బాధితులకు అండగా ఉండాలని, న్యాయం జరిగేలా చూడాలని అన్నారు.జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి రఘువరణ్ మాట్లాడుతు జిల్లా లో జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో, 18 మండలాల్లో మండల సమాఖ్యల ద్వారా జెండర్ రిసోర్స్ కేంద్రాలను ఏర్పాటు చేసి మహిళలకు అండగా ఉండేలా చూడటం జరిగుతుందని అన్నారు.సెర్ప్ ఎపిడి పి.సునీత మాట్లాడుతు జగిత్యాల జిల్లా లో ఇప్పటికే మహిళలకు సమస్యలు ఉంటే జిల్లా, మండల సమాఖ్య లో ఉన్న జెండర్ కమిటీ ల ద్వారా పరిష్కారశీ చూసేలా చేయడం జరిగిందని అన్నారు.సెర్ప్ జెండర్ ప్రాజెక్టు అధికారి లింగయ్య గౌడ్ మాట్లాడుతు జెండర్ కమిటీ కోసం ప్రతి మండలంలో కేంద్రాన్ని ఏర్పాటు చేసి, అట్టి కార్యాలయం లో చార్టులు, బోర్డులు, రికార్డులు ఏర్పాటు చేసి సమస్యలు వచ్చి నప్పుడు అందులో నమోదు చేసి ఎప్పటికప్పుడు పరిష్కారం చూసేలా చేయడం, అందుకోసం సెర్ప్ ద్వారా ప్రత్యేక శిక్షణలు, అవగాహన కార్యక్రమాలు చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లా జెండర్ డిపియం రమేష్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరోజన, కార్యదర్శి ఎన్. ఆమనీ, కోశాధికారి సి. హెచ్. హరిత, జిల్లా ఐబీ హేచ్.డి. ఎపియం గంగాధర్, ఎల్. హెచ్ ఎపియం త్రివేణి, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి ఎపియం లు సమత, రాజయ్య, ప్రవీణ్, మూడు మండలాల మండల సమాఖ్య అధ్యక్షురాళ్లు, కార్యదర్శి, కోశాధికారులు, జెండర్ కమిటీ సభ్యులు, జిల్లా సమాఖ్య సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు హాజరయ్యారు.

# పర్యావరణ పరిరక్షణ కే జూట్ బ్యాగుల తయారీ

## -శిక్షణను సద్వినియోగం చేసుకోండి -ఆర్జీ-3 సేవా అధ్యక్షురాలు, జీఎం సుంకర

**సూర్య, సెంటినరీ కాలనీ**

పర్యావరణ పరిరక్షణ కే జూట్ బ్యాగుల తయారీ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ-3 సేవా అధ్యక్షురాలు సుంకర తిరుమల, ఆర్జీ-3 జీఎం సుంకర మధుసూదన్ అన్నారు. సింగరేణి ప్రభావిత గ్రామమైన రత్నాపూర్ గ్రామంలో సింగరేణి సేవా సమితి, స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమపీవీరావు సహకారంతో జ్యూట్ బ్యాగు శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ముఖ్యంగా నేడు ప్లాస్టిక్ వినియోగం, ప్లాస్టిక్ సంచుల వినియోగం, ఇతర ప్లాస్టిక్ వస్తువులు వినియోగం తీవ్రంగా పెరిగిందని అన్నారు. దీని మూలంగా పర్యావరణ పరిరక్షణ దెబ్బతింటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మన పూర్వీకులు చేతి గోనె సంచులు వాడే విషయాన్ని గుర్తు చేశారు. కానీ నేడు ఆహారంతో పాటు ప్రతి వస్తువును కూడా ప్లాస్టిక్ బ్యాగులులో తీసుకోపోవడం వల్ల అనేక రోగాల బారిన పడుతున్నామని అన్నారు. దీనిని దృష్టిలో



ఉంచుకొని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో జూట్ బ్యాగులు తయారీ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి మహిళ తన వంతు కర్తవ్యం గా ఇటు కుటుంబాన్ని చూసుకుంటూ అటు ఉపాధి కోసం ఇటువంటి శిక్షణ తరగతులలో పాల్గొనాలని వారు కోరారు.ఈ శిక్షణ ద్వారా తాను నేర్చుకొని స్వయం ఉపాధి పథకం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. సింగరేణి యాజమాన్యం స్థానిక ప్రభావిత గ్రామాల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తుందన్నారు. ఈ క్రమంలోనే స్థానిక యువతకు,మహిళలకు, భూనిర్వాసితులకు స్వయం ఉపాధి కల్పించే అవకాశాలలో భాగంగా ఇటువంటి శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తున్నా మన్నారు. స్థానిక ప్రభావిత గ్రామాల అభివృద్ధికి ఏ విధంగా అయినా సింగరేణి యాజమాన్యం తోడ్పడుతుందని వారు అన్నారు. ఈ సందర్భం గా వీరిద్దరిని స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిఓ పొన్నవేని రాజేశం, ఉప సర్పంచ్ భాద్రపు. ప్రవల్లిక ప్రశాంత్, సెక్రటరీ గంగుల సంతోష్, సేవా సెక్రటరీ రాళ్లబండ. ఉమారాణి, అస్సిటెంట్ సెక్రటరీ భాస్కరల. అరుణ, వార్డు సభ్యులు పబ్బా స్రవంతి వెంకటేష్, జక్కుల పద్మ చందన్, బత్తిని ప్రశాంత్, అల్లి రమేష్, పున్నశీ మణి తేజ, జుట్టు యశోద సత్యనారాయణ, బత్తుల రాజమణి రమేష్ , ఇన్స్ట్రక్టర్ బోడా క్రాంతి, కారోబార్ కొండపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మురికి కాలువలలో పేర్కొని పోయిన చెత్త, చెదారం తొలగింపు ప్రారంభం

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రాంనగర్ లో బుధవారం మురికి కాలువలలో పేర్కొని పోయిన చెత్తాచెదారం (షీల్ట్) తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. సర్పంచ్ పల్లె ప్రతిమపీవీరావు ఆధ్వర్యంలో ఈ పనులు ప్రారంభమయ్యాయి. గ్రామంలోని మురికి కాలువలో భారీగా చెత్తా, చెదారం పేర్కొని పోయింది. ఈ క్రమంలో స్పెషల్ డ్రైవ్ కింద ఈ పనులను ప్రారంభించడం జరిగింది. గ్రామంలోని అన్ని మురికి కాలువలలో షీల్ట్ తీయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాద్రపు ప్రవళిక- ప్రశాంత్, సెక్రటరీ గంగుల సంతోష్, వార్డు సభ్యులు జక్కుల పద్మ చందన్, బత్తిని ప్రశాంత్, అల్లి రమేష్, పున్నశీ మణి తేజ, జుట్టు యశోద సత్యనారాయణ, బత్తుల రాజమణి రమేష్ ,కారోబర్ కొండపర్తి శ్రీనివాస్, స్థానిక నాయకులు సందవేన కుమార్, ఖండే కిష్టయ్య, నగునూర్ శ్రీనివాస్, జంగేటి కుమార్, అల్లం రాజేందర్, సామ శ్యామసుందర్, మొగిలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నేడే ఉచిత వైద్య శిబిరం

## రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సు

**సూర్య కొడిమ్యాల**

మండలం లోని హిమ్మత్‌రావుపేట గ్రామ పంచాయతీ ఆవరణలో నేడే ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరానికి కరీంనగర్ కి చెందిన ప్రముఖ హాస్పిటల్ వైద్యులు హాజరై గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాజీ సర్పచ్ ల ఫోరం అధ్యక్షులు పునుగోటి కృష్ణారావు తెలిపారు.అలాగే వరి పంటలలో గడ్డి మందుల వినియోగం వల్ల కలుగుతున్న ఆరోగ్య సమస్యలు, ప్రాణ నష్టాలపై రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సు కూడా నిర్వహించనున్నారు. వ్యవసాయంలో జాగ్రత్తలు, రసాయనాల వినియోగంలో పాటించాల్సిన నియమాలు, ఆరోగ్య భద్రతపై నిపుణులు వివరించనున్నారు. కావున హిమ్మత్‌రావుపేటతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, ముఖ్యంగా రైతులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## వార్డ్ మెంబర్ ను సన్మానించిన రత్నాపూర్ సర్పంచ్

**సూర్య, సెంటినరీ కాలనీ**

రామగిరి మండలం పన్నూరు గ్రామానికి చెందిన వార్డు మెంబర్ భాస్కర్ల అరుణ ను బుధవారం రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ పివీరావు సన్మానించారు.

# స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించిన జేఎన్‌టీయూహెచ్ ఇంజనీరింగ్ కళాశాల

**సూర్య కొడిమ్యాల**



నాచుపల్లి గ్రామంలో ఉన్న జేఎన్‌టీయూహెచ్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రాంగణం మరియు పరిసర ప్రాంతాల్లో విద్యార్థులు శుభ్రత కార్యక్రమాలు చేపట్టి పరిసరాలను శుభ్రపరిచారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరసింహ మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమం విద్యార్థులకు ఒక మంచి వేదికలాంటిదని, సామాజిక బాధ్యతను పెంపొందించే కార్యక్రమమని పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా అందించే 240 గంటల సర్టిఫికేట్ ఒక నేషనల్ స్పోర్ట్స్ సర్టిఫికేట్‌కు సరిసమానమని, భవిష్యత్తులో ఉన్నత విద్య మరియు ఉద్యోగావకాశాల్లో ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, వివిధ విభాగాధిపతులు ప్రొఫెసర్ కె. సాహు చత్రపతి, ప్రొఫెసర్ ఎం.ఎన్. రాజశేఖర్, శ్రీ సి. రాధాచరణ్ పాల్గొన్నారు. అలాగే ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్లు ఎస్. ప్రవీణ్ కుమార్ మరియు పి. సంగీత సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని స్వచ్ఛతపై సమాజానికి మంచి సందేశాన్ని అందించారు.

## సీఎం కప్ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ కు ఎంపికైన క్రీడాకారులు

**సూర్య, సెంటినరీ కాలనీ**



మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి సీఎం కప్ బ్యాడ్మింటన్ పోటీల్లో గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను అధికారులు వెల్లడించారు. జూనియర్, సబ్ జూనియర్ బాలబాలికలకు నిర్వహించిన పోటీల్లో జిల్లాకు చెందిన 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అండర్ 15 బాలికల విభాగంలో కె.ఆరాధ్య, ఎం.అఖిల్, ఎన్ .వనిత, వంశిక దేవద, వై.సమన్విత ఉన్నారు. అండర్ 19 విభాగంలో ఎం.పవిత్ర, ఎం.మైథిలి, టి.జోషిక, టి.సంజన, ఎన్.శృతిలు జిల్లా స్థాయిలో గెలిచి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. బాలుర అండర్ 15 విభాగంలో వి.గౌతమి సాయి, ఎస్.జస్విత్, బి.సాయి చరణ్, ఆర్. శ్రావణ్ కుమార్, టి.వరుణ సాయిలు జిల్లా జట్టుకు ఎంపికైనారు. అండర్ 19 బాలుర విభాగంలో కె.నందన్, కె.వరుణ్ ప్రసాద్, పి. చిరంజీవచారి, పి.భరత్ చంద్రలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఉదయ్ కుమార్ అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జిల్లా ఖ్యాతిని రాష్ట్రానికి ఇనుమడింప చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు పింగళి కృష్ణారెడ్డి, జి.సునీల్ కుమార్, ఎ.విజయ్ కుమార్, వల్లంభట్ల శ్రీనివాస్, సమ్మయ్య, పెటా అధ్యక్షుడు వేల్పుల సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక అక్షరాభ్యాసం

**సూర్య మల్లాపూర్**



మండలంలోని చిట్టాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం సామూహిక అక్షరా భ్యాసం కార్యక్రమాన్ని నిర్వహిం చారు. సర్పంచ్ సంపతి శంకరమ్మ చేతుల మీదుగా విద్యార్థిని విద్యార్థులకు అక్షరాభ్యాసాన్ని చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అంగన్వాడి కేంద్రం ద్వారా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నపిల్లలకు పంపిణీ చేస్తున్నా పౌష్టికాహారాన్ని ఆరోగ్య రీత్యా సలహా సూచనలను పాటించాలని అన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాల్సాని ప్రణయ్ గౌడ్, ఎంఎల్ హెచ్ పి దేవిప్రసన్న, ఏఎన్ఎం పద్మ, అంగన్వాడీ టీచర్లు శ్రీదేవి, స్వరూప, లావణ్య, ఆశా కార్యకర్తలు సునీత, స్వప్న, అనూష పాల్గొన్నారు.

# సింగరేణి నర్సరీలో టెండర్లు వేయలేమని తేల్చి చెప్పిన కాంట్రాక్టర్లు

**- నర్సరీ లో 3 నెలలుగా "ఆగిన" పనులు - రాబోయే వర్షాకాలంలో మొక్కలు నాటేదెలా...?**

**- 500 మంది తాత్కాలిక కార్మికుల పరిస్థితి అగమ గోచర్యం...!**

**సూర్య, సెంటినరీ కాలనీ**

సింగరేణి సంస్థలో 11 ఏరియాలలో వున్న నర్సరీల టెండర్లు వేయలేమని కాంట్రాక్టర్లు భీష్మించుకొని కూర్చున్నారు. సింగరేణి ఫారెస్ట్రీ డెవలప్మెంట్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాంట్రాక్టర్లు టెండర్లు వేయడం లేదు. సింగరేణి ప్రాంతంలోని నర్సరీలలో మొక్కలు పెంచడం, బీడింగ్, గ్రేడింగ్, షిఫ్టింగ్, గడ్డి తీయించడం, వాటర్ స్ప్రే వంటి పనులకు "గుత్తా" గా కాంట్రాక్టు పిలిస్తారు. ఇప్పటి వరకు నర్సరీ లో పనిని బట్టి వర్కర్ లను తీసుకుంటున్నారు. వీరికి సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్టు కింద పనిచేసే కార్మికుల మాదిరిగా సిఎంపిఎఫ్, బోనస్, వైద్యం, ఇన్సూరెన్స్, జీవో ప్రకారం వేతనాలు ఉండవు. కాగ ఈ మధ్యకాలంలో అన్ని సౌకర్యాలు వర్తింప చేయాలనీ టెండర్లు పిలిచింది. కానీ వీటికి



సంబంధించి యూనిట్ రేట్ కాకుండా ఎంత మంది వర్కర్లను పెట్టాలని సూచించకుండా టెండర్లు పిలవడంపై కాంట్రాక్టర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గుత్తా పద్ధతిలో టెండర్లు పిలిస్తే కార్మికులకు కనీస సౌకర్యాలు కలిగించడం కష్టం అవుతుం దని కాంట్రాక్టర్లు వాదిస్తున్నారు. సింగరేణి సివిల్ కాంట్రాక్టర్ల మాదిరిగా ఫారెస్ట్ కాంట్రాక్టర్ కు కూడా రిజిస్ట్రేషన్ పద్ధతి ప్రవేశపెట్టాలని, అన్ని రకాల ఫారెస్ట్ టెండర్లను సంబంధింత అనుభవంతో మాత్రమే అనుమతించాలని, ఈఎండి ని సింగరేణి సివిల్ కాంట్రాక్టర్ల మాదిరిగా 2.1/2 శాతానికి కుదించాలని, నర్సరీలో ప్రవేశపెట్టనున్న సీఎంపీఎఫ్ అమలు విధానాన్ని పార్కులు మరియు గార్డెన్ల టెండర్ల మాదిరిగా అమలు చేయాలని, ప్రస్తుత మార్కెట్ రేట్లకు అనుగుణంగా ఎఫ్.ఎస్.ఆర్ మరియు హెచ్.ఎస్.ఆర్ రేట్లను పెంచాలని, ఓబీ ప్లాంటేషన్ టెండర్లను ఆరు నెలల కాల పరిమితితో వన్ టైం మేజర్ కింద టెండర్లు పిలవాలని, ఓబీ ప్లాంటేషన్ టెండర్లలో ప్లాంటేషన్ పూర్తి అయిన తర్వాత పూర్తి స్థాయిలో రెన్యుమరేషన్ చేయడం సాధ్యం కాదు కావున అట్టి కండిషన్ ను తొలగించాలని, ప్లాంటేషన్ కోసం రక్షణ లేని స్థలాలలో టెండర్లు పిలవకూడదని, (ట్రెంచ్, ఫెన్సింగ్, ల్యాండ్ లిటిగేషన్ తదితర సమస్యలు), పార్కులు మరియు గార్డెన్ లో పనిచేస్తున్న వర్కర్ల గైరుహాజరు విషయంలో సింగరేణి సివిల్ సర్క్యులర్ మాదిరిగా 25 శాతం వరకు అనుమతించాలని, నాన్ వర్కర్ పెనాల్టీని తొలగించాలని, సింగరేణి సివిల్ కాంట్రాక్టర్ల మాదిరిగా ఎంఎస్ఎంఈ రిజిస్ట్రేషన్ హోల్డర్స్ కు



ఈఎండి చెల్లింపు నుంచి మినహాయింపు ఇవ్వాలని, వాచ్ అండ్ వార్డుల జీతాలను పెంచాలని, గత సంవత్సర కాలంగా ఖాళీ వున్న ఫారెస్ట్ డిపార్ట్మెంట్ హెచ్ఓడి పోస్టును సమర్థవంతమైన అధికారిచే భర్తీ చేయాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని సిఅండ్ఎండి వి వినతిపత్రం అందించినట్లు యూనియన్ అధ్యక్షులు సుంకర విజయ్ కుమార్, ఉపాధ్యక్షులు మారుతి శ్రీనివాసరావు, గుడి నారాయణరెడ్డి, అన్నం రమేష్, ప్రధాన కార్యదర్శి సాధినేని సదానందం, కోశాధికారి పిట్టల శివకృష్ణ, సెక్రటరీ లు ఎస్.రాజయ్య, ఏం.శ్రీనివాసరావు, రమేష్ రావు, సుధాకర్, వి.అంజయ్య, ఎస్ కె.జాన్ ఖాన్, పొన్నం రవీందర్, ప్రభాకర్ రెడ్డి, సంతోష్ కుమార్ లు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా రాబోయే వర్షాకాలంలో 519 హెక్టర్ లలో 16 లక్షలకు పైగా మొక్కలు నాటనున్నారు. వీటి పరిస్థితి అధ్వానంగా మారింది. టెండర్లు వేయకపోతే మొక్కలు నాటే స్థితి నుండి ఎండిపోయే ప్రమాదం ఉంది. కాంట్రాక్టర్ల సమ్మె తో సుమారు 400 మంది కార్మికులకు పని కరువైంది.

## టెండర్ లలో మార్పు చేయకపోతే నష్టపోతాం

**-కాంట్రాక్టర్ యూనియన్ అధ్యక్షులు సుంకర విజయ్ కుమార్**



సింగరేణి నర్సరీ లలో టెండర్ లలో మార్పు చేయాలి. లేకపోతే తీవ్రంగా నష్టపోతాం. కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పిస్తాం. ఇదే మాదిరిగా మాకు నిబంధనలు సడలించి టెండర్లు పిలవాలి.

## నర్సరీ కార్మికులకు అన్ని చట్టబద్ధ హక్కులు కల్పించాలి

**- ఐఎఫ్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల వెంకన్న**



సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న 300 మంది నర్సరీ కార్మికులకు అన్ని చట్టబద్ధ హక్కులు కల్పించాలి. అదే విధంగా సింగరేణి యాజమాన్యం 14.02.2025 వ తేదీన విడుదల చేసిన సర్క్యులర్ ను కూడా యాజమాన్యమే పట్టించుకోవడం లేదు. అధికారుల మధ్య సమన్వయం లోపం వల్ల ఇలాంటి టెండర్లకు ప్రమాదం వాటిల్లుతుంది. ఈ విధానాల వల్ల యాజమాన్యంకు, కార్మికులకు నష్టం వాటిల్లుతుంది.



# రాష్ట్ర స్థాయి సి ఎం కప్ పోటీలకు మండల విద్యార్థినిలు

**సూర్య,రాయికల్**



ఇటీవల జగిత్యాల లోజరిగిన జిల్లా స్థాయి సి ఎం కప్ పోటీలలో రాయికల్ మండలం రామాజీపేట, అల్లీపూర్,తాట్లవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థినిలు ఎంపికైనట్లు ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. రామాజీపేట గ్రామానికి చెందిన ఎనుగంటి సాహిత్య(కబడ్డీ)పోటీలకు ఎంపికవ్వగా,విద్యార్థిని ఈనెల 20వ తేదీ నుండి హైదరాబాద్ లో జరిగే సీఎం కప్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటుందని ప్రధానోపాధ్యాయులు గజ్జేల నరేందర్,వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాప్ రెడ్డి తెలిపారు.అలాగే అల్లీపూర్ గ్రామానికి చెందిన టి.అనూష,శేషి ప్రియ,నితీషా (అథ్లెటిక్స్), ఎన్.షర్మిల, శ్రీనిథి(బాస్కెట్ బాల్) నందు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పోరండ్ల కిరణ్ పీడీ క్రిష్ణ ప్రసాద్ లు తెలిపారు.ఎంపికైన వారు ఈ నెల 20 వ తేదీ నుండి 22 వరకు హనుమ కొండ ,నిజామాబాదు లలో జరిగే అథ్లెటిక్స్ బాస్కెట్ బాల్ పోటీలలో,పాల్గొంటారని తెలిపారు.అలాగే తాట్లవాయి గ్రామానికి చెందిన మాదం వర్ష(అథ్లెటిక్స్)నునావత్ రాజు (వాలీబాల్ ) విభాగాలు రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపీ నట్లు ప్రధానోపాధ్యాయులు భోగ రమేష్ వ్యాయామ ఉపాధ్యాయురాలు కొక్కుల సుజాత తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినిలను ఆయా గ్రామాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు,గ్రామ ప్రజా ప్రతినిధులు అభినందించారు.

# కుమ్మరికుంటలోకి నీటి విడుదల

**- 150 మీటర్ల కందకం, పైప్‌లైన్‌తో సమస్యకు పరిష్కారం**

**సూర్య, కోనరావుపేట**

కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో నీటి కొరత నివారణకు కీలక చర్యలు చేపట్టారు. మల్కాపేట రిజర్వాయర్ నుంచి వచ్చే నీటిని అధికారులు ఈరోజు గ్రామంలోని కుమ్మరికుంటలోకి విడుదల చేశారు.గ్రామంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యగా సర్పంచ్ జిన్న అనూష -- అనిల్ కుమార్ రైతులతో చర్చలు జరిపి సుమారు 150 మీటర్ల కందకం త్రవ్వించి, త్రోవకు పైప్‌లైన్ ఏర్పాటు చేయించారు. దీంతో రిజర్వాయర్ నుంచి నీరు నేరుగా కుమ్మరికుంటలోకి చేరేలా ఏర్పాట్లు పూర్తయ్యాయి.నీటి విడుదల సందర్భంగా సర్పంచ్, పాలకవర్గ సభ్యులు గ్రామస్థులతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ చర్యతో సాగునీరు, తాగునీటి అవసరాలు కొంతవరకు తీరనున్నాయని గ్రామస్థులు తెలిపారు. గ్రామాభివృద్ధికి కృషి చేసిన సర్పంచ్‌ను ప్రజలు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వాసంపెల్లి శ్రీనివాస్, వార్డు సభ్యులు జాగిరి ఆనందం, జాగిరి కిరణ్, మోకేనపెల్లి బాలరాజు, జాగిరి లక్ష్మీ శంకర్, చిద్రవేణి నరేష్, జిన్న సమత అర్జున్, రేగుల పద్మ పరిశరాములు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.





# కోరుట్ల మండలం పురగిరి క్షత్రియ పెరుక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**సూర్య కరీంనగర్**

కోరుట్ల మండల పురగిరి క్షత్రియ పెరిక సంఘం నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షులు బొడ్డు బుచ్చన్న అధ్యక్షతన పట్టణం లోని కావేరి గార్డెన్ లో సమావేశం నిర్వహించుకొని మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు కోరుట్ల మండల అధ్యక్షులుగా పోతరాజు రవి, ఉపాధ్యక్షులుగా సున్నం అశోక్, నల్లపు రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సంఘాని లక్ష్మణ్, కోశాధికారిగా సంగని పెద్ద నరసయ్య,సంయుక్త కార్యదర్శిగా నల్లపు ప్రవీణ్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా పోతరాజు చిన్న రాజం, సంగని చిన్న రాజం, అరసం రంజిత్ కుమార్ నల్లెల చిన్న మల్లయ్య, బొడ్డు రాధా కిషన్,కోటి గంగాధర్, సంఘని రమేష్, సంఘని చిన్న రాజం,బొడ్డు మల్లేశం, కారుకూరి సురేష్,పోతురాజు శ్రీనివాస్ లను ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో పెరిక సంఘం జిల్లా నాయకులు నల్లెల మల్లేశం, మీసా వేణు, గడి కొప్పుల గోపాల్, చలిగంటి వినోద్ కుమార్, ముత్తె గట్రాజు, తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ చొరవతో ఇస్లాం నగర్ కాలువ సమస్య పరిష్కారం

**సూర్య, సెంటినరీ కాలనీ**





కమాన్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఇస్లాం నగర్ వాటర్ ట్యాంక్ సమీపంలో మురికి కాలువ ఎన్నో రోజులుగా మట్టితో నిండిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువ మూసుకుపోవడంతో నీరు నిలువ అయి దుర్వాసన, దోమల సమస్యలు పెరిగిన నేపథ్యంలో గ్రామస్థులు ఈ సమస్యను సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన సర్పంచ్ బుధవారం జెసిబి యంత్రం తో మట్టిని తొలగించి కాలువను శుభ్రం చేయించారు. తాత్కాలిక పరిష్కారంతో సరిపెట్టకుండా, మళ్లీ సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఆ కాలువను పక్కనే ఉన్న కుంటలోకి మరో కొత్త కాలువ తవ్వించి అనుసంధానం చేయించారు. అదే విధంగా వాటర్ ట్యాంక్ నుండి ఓవర్‌ఫ్లో అవుతున్న నీరు రోడ్డుపై నిల్వ కాకుండా చిన్న కాలువ తవ్వించి పైప్‌లైన్ ద్వారా మళ్లించి చర్యలు చేపట్టారు. నీటి నిల్వలు లేకుండా శాశ్వత పరిష్కారం అమలు చేస్తామని సర్పంచ్ పేర్కొన్నారు. స్థానికులు ఈ చర్యలను స్వాగతిస్తూ గ్రామ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పారిశుధ్యంపై తీసుకున్న ఈ చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంట గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఈ సమావేశానికి హాజరయ్యారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నదులపై చెక్ డ్యాములు నిర్మించినచోట భద్రత దృశ్య డ్యాముకు ఎగువన, దిగువన 300 మీటర్ల వరకు ఇసుక తోడడం నిషేధమని, అధికారులు ఎప్పటికప్పుడు ఈ అంశాన్ని పర్యవేక్షించాలని అన్నారు.

# నువ్వుల పంట సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతుల పై రైతులకు అవగాహన సదస్సు

**సూర్య మల్యాల**

తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కరీంనగర్ మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మల్యాల మండలం తాటిపల్లి గ్రామంలో బుధవారం నువ్వుల పంట సాగులో వివిధ యాజమాన్య పద్ధతుల రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా తెలంగాణ రైతు విజ్ఞ కేంద్రం కరీంనగర్ శాస్త్రవేత్త కోఆర్డినేటర్ డాక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ రైతులు నువ్వుల పంటలో సరైన మోతాదులో సరియైన ఎరువుల రకాలను సరైన సమయంలో వాడడం నత్రజనికి సంబంధించిన పోషకాలను యూరియా రూపంలో రెండు దఫాలుగా అనగా మొదటి దఫాను ఆఖరి దుక్కిలో 25 కేజీలు మరియు రెండవ దఫాను పూత దశలో మిగిలిన 25 కేజీలను వేసుకోవాలి. భాస్వరానికి సంబంధించిన పోషకాలను ఎకరానికి 50 కేజీల చొప్పున ఆఖరి దుక్కిలో మరియు 13 కేజీల



న్యూ రేట్ ఆఫ్ ఫొటోస్ ను ఆఖరి దూకిలో వేసుకోవాలి. నూనె గింజల పంటల సాగులో నూనె శాతాన్ని పెంచే కాల్షియం మరియు సల్ఫర్ వంటి పోషకాలు సింగిల్ సూపర్ పాస్ పెట్ రూపంలో ఇవ్వడం వలన భాస్వరం తో పాటు కాల్షియం, సల్ఫర్ పోషకాలను కూడా మొక్కలకు అందించవచ్చు. నువ్వులలో ప్రధానంగా వచ్చే చీడపీడలు రసం పిలిచే పురుగులు బూడిద తెగులు మరియు వేరుకుల్లు తెగులు దీని నివారణకై రసం పిలిచే పురుగుల నివారణకై అసెఫట్ 1.5 గ్ర లీటర్ నీటికి, బూడిద తెగులు నివారణకు మైక్లో బ్యూటీనిల్ 1గ్ర లీటరు నీటికి మరియు వేరు కుళ్ళు తెగులు నివారణకు కార్బన్డిజం 1 గ్ర లీటర్ నీటిలో కలిపి మొక్క మొదల దగ్గర పోయాలనీ సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం రాజేంద్రప్రసాద్ వివరించారు. అదేవిధంగా డాక్టర్ కే మదన్మోహన్ రెడ్డి వ్యవసాయ విశ్వవిద్యాలయానికి సంబంధించిన డిజిటల్ సాంకేతిక మాధ్యమాల ద్వారా వ్యవసాయ సూచనలు సలహాలు తీసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి చంద్ర దీపక్, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్ రెడ్డి మంజులగ్రామ సర్పంచ్ మెట్పల్లి లత ఉపసర్పంచ్ లక్ష్మణ చారి వార్డు మెంబర్ తిరుపతి రైతులు కరీంనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు (మెహక్ ఖానం,వర్ష ,శౌమ, హిమబిందు, గణేశ్వరి) తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు...

**సూర్య, ముస్తాబాద్**



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయ ఆవరణంలో శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సి.ఈ.ఓ జడ్పీ వినోద్ కుమార్, ఎంపీడీవో లచ్చాలు, డాక్టర్ చందర్ నాయక్, మొర్రాపూర్ సర్పంచ్ రాజు నాయక్, సేవాలాల్ తండా సర్పంచ్ సరిత రవి హాజరయ్యారు. అలాగే కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యేళ్ళ బాల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ రావు, లకావత్ నరసింహులు, సంజీవ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ బంజారా సమాజ అభ్యున్నతికి చేసిన సేవలు అమూల్యమని, ఆయన ఆశయాలను యువత కొనసాగించాలని తెలిపారు. అలాగే మండల కేంద్రంలో సంఘ భవనానికి స్థలం ఇవ్వాలని అధికార పార్టీ నాయకులను, అధికారులను కోరారు సమాజంలో ఐక్యత, సేవాభావం పెంపొందించేందుకు ఆయన జీవితం ఆదర్శమనిపేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, మేంగని మనోహర్ ,శీలం స్వామి,యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పాల్గొన్న వారికి ప్రసాదాలు పంపిణీ చేశారు.

## ఈ నెల28న జిల్లా స్థాయి లో జాతీయ సైన్స్ డే నిర్వహణ

**సూర్య, ఇల్లంతకుంట**




ఈ నెల 28 న సైన్స్ డే ను పురస్కరించుకొని మండల స్థాయి ఫిసికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ ఎం ఆర్ సి భవనంలో నిర్వహించారు. మండల ం లోని వివిధ పాఠశాలల నుండి 27 మంది విద్యార్థులు పాల్గొనగా పరీక్షలు నిర్వహించారు. రహీంఖాన్ పేట మోడల్ స్కూల్ లో చదువుతున్న సి హెచ్. హారిక ప్రథమ స్థానం, రెండవ స్థానంలో అదే స్కూల్ కి చెందిన నిఖిల్ 30 మార్కులు సాధించి ద్వితీయ స్థానం,కేజీబివి పాఠశాల విద్యార్థిని కే. మమత 28 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారు. ఈ విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించే పరీక్ష లో పాల్గొంటారని మండల విద్యాధికారి సి హెచ్. శ్రీని వాస్ గౌడ్ తెలిపారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ హెచ్ ఎం. ఎం.ప్రేమ లత మండలఎఫ్ పి ఏస్ టి కోఆర్డినేటర్ సల్వాజీ మధుసూదన్ రావు, వివిధ పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**- వెల్గటూర్ ఎస్సై ఉదయ్ కుమార్**

**సూర్య ఎండపల్లి**




బాల్య వివాహాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతతో కృషి చేయాలని సహాయ వెల్ఫేర్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ , జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన ప్రచార రథాన్ని వెల్గటూర్ ఎస్ ఐ ఉదయ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు,ఉమ్మడి మండలం లో అన్ని గ్రామాలలో అలాగే పాఠశాలలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు,బాల్యం అమూల్యమైన దశ అని, బాల్య వివాహాలు పిల్లల చదువు, ఆరోగ్యం, శారీరక,మానసిక అభివృద్ధిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. చదువు మధ్యలో ఆగిపోవడం వల్ల జీవితాంతం ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని, బాలికల విద్యను ప్రోత్సహిస్తూ ఉచిత విద్యను అందుబాటులోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. పిల్లలు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ల్ ఈ ప్రచార రథం అన్ని మండలలో తిరిగి అవగాహన కార్యక్రమాలు చేయడం జరుగుతుంది అని తెలిపారు,ఈ కార్యక్రమంలో సహాయ వెల్ఫేర్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ పోలవేణి భూమేష్, కమ్యూనిటీ మొబ లైజర్లు లత,శ్యామల, లహరి గ్రామ పంచాయతీ కార్యదర్శి లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నంలో స్పెషల్ డ్రైవ్

**సూర్య ఇబ్రహీంపట్నం**



ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఎస్సై జి. నవీన్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో కలిసి ప్రత్యేక తనిఖీ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్‌లపై ఆకతాయిలుగా తిరుగుతున్న వ్యక్తులు మరియు మైనర్ డ్రైవింగ్ చేస్తున్న వారిని గుర్తించి, వారి వాహనాలతో పాటు పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నవీన్ కుమార్ మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇకపై మైనర్ పిల్లలు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే బైక్‌లపై ఆకతాయితనానికి పాల్పడుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రమాదాల నివారణ, ప్రజల భద్రత దృష్ట్యా ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

## తలుపులతో దర్శనం ఇస్తున్న పంచాయితీ కార్యాలయాలు

**- తలుపులు వేసి ఉంచడంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు**

**సూర్య, ముస్తాబాద్**




మండలంలో ప్రత్యేకాధికారుల పాలన పదవీకాలం ముగిసి,నూతనంగా పంచాయతీలలో పాలకవర్గాలు ఎర్పడిన పంచాయతీ కార్యాలయాలకు తలపులు వేసి ఉండటం,సర్పంచులు,కార్యదర్శులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలం లో చాలా గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలు తెరుచుకోవడం లేదు. సర్పంచులు, కార్యదర్శులు అందుబాటులో లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. గ్రామపంచాయతీ కార్యాలయం తలుపులు వేసి ఉంచడంతో సేవలను వినియోగించడానికి వచ్చిన ప్రజలు అధికారులు, పాలకవర్గం లేకపోవడం, కార్యాలయం తలుపులు వేసి ఉండడం చూసి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటూ నిరాశతో తిరిగి వెళుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని, కార్యాలయాలను తెరిపించి, సేవలను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

## మున్సిపల్ చైర్మన్ జిందం కళా చక్రపాణికి ఘన సన్మానం

**- శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ సిబ్బంది**

**సూర్య రాజన్న సిరిసిల్ల**



ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించి, రెండోసారి సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జిందం కళా చక్రపాణిని మున్సిపల్ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ?మున్సిపల్ కమిషనర్ ఖాదర్ పాషా నేతృత్వంలో బుధవారం సిబ్బంది చైర్మన్ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం చైర్మన్ దంపతులను అధికారులు ఘనంగా సన్మానించారు. రెండోసారి పట్టణ అభివృద్ధి పగ్గాలు చేపట్టినందుకు హర్షం వ్యక్తం చేస్తూ, మున్సిపల్ యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఈ వాణి, ఆర్వో రామ్మోహన్ రాయ్, ఏఈ నరసింహ స్వామి, ఎస్సై కిరణ్ మొదలగు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొని పురపాలక సంఘ అధ్యక్షురాలు జిందం కళా చక్రపాణికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## లక్ష్మి నరసింహా స్వామి దర్శించుకున్న ఆర్.టి.ఐ కమిషనర్లు

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలోని లక్ష్మినరసింహ స్వామి ని సమాచార హక్కు చట్టం(ఆర్. టి.ఐ) కమీషనర్లు పి.శ్రీనివాసరావు, మొహసిన ప్రవీణ్, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్యరెడ్డి దర్శించుకున్నా రు. ఆలయ అర్చకులు వారికి స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీవో కాసబోయిన సురేష్, ఎంపీడీఓ బద్రి శైలజరాణి, తహసీల్దార్ పర్నంది సుమన్, ఆర్జీ-1 జిఎం దొనకొండ లలిత్ కుమార్, సర్పంచ్ నరేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆయుర్వేద వైద్య శిబిరంను సద్వినియోగం చేసుకోవాలి

**సూర్య, సెంటినరీ కాలనీ**



సింగరేణి సంస్థ ఆర్జీ-2 డివిజన్ 8వ కాలనీ లోని సీఈఆర్ క్లబ్ లో ఈ నెల 20వ తేదీన నిర్వహించే ఆయుర్వేద వైద్య శిబిరంను సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ-2 ఏరియా అధికార ప్రతినిధి అరవింద్ రావు (ఎజిఎం పర్సనల్)ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆయుర్వేద వైద్యుడు విశ్వనాథ మహర్షి చే వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, దీర్ఘకాలిక వ్యాధులు బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, నడుము నొప్పులు, అస్తమా, చర్మ వ్యాధులు మొదలైన వాటికి పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోగలరని ఒక ప్రకటనలో తెలియజేశారు.